నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
మెదక్
గురువారం | 14 నవంబర్ 2024 | www.navatelangana.com

పారిశ్రామిక వాడలో ఎండు గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



నవతెలంగాణ-పటాన్‌చెరు

పారిశ్రామికవాడ కేంద్రంగా పటాన్‌చెరు, ఇస్నాపూర్, ఘనపూర్ ప్రాంతాల్లో కార్మికులకు గంజాయి విక్రయిస్తున్న నలుగురు సభ్యుల ముఠాను జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ పోలీసులు ఎర వేసి పట్టుకున్నారు. జిల్లా ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారి శంకర్ వివరాల మేరకు బీహార్‌కు చెందిన టోకిర్ హబీబ్ (28) ఒరిస్సాకు చెందిన మదకామి లోచ (27), ఎర్మే సునాం (33), పూనిమ్ (33) ముఠా పటాన్‌చెరు పట్టణంలో జాతీయ రహదారిపై ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ టీమ్ అధ్వర్యంలో విశ్వసనీయ సమాచార మేరకు తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని నొవోపాన్ సమీపంలోని వాల్యూ జోన్, ఘనపూర్‌లో పని చేసే కార్మికులకు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు కాపు కాసి పట్టుకున్నామన్నారు. ముఠా సభ్యులపై కేసు నమోదు చేసి, వారి వద్ద నుంచి సుమారు ఆరున్నర కిలోల ఎండు గంజాయి, ఒక బైక్ స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఔటర్ రింగ్ రోడ్డుపై అదుపుతప్పి క్వాలిస్ బోల్తా



ఆరుగురికి తీవ్ర గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం

నవతెలంగాణ-అమీన్‌పూర్ : ఔటర్ రింగు రోడ్డుపై అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలోసుల్తాన్ పూర్- కిష్టారెడ్డిపేట సమీపంలో అర్ధరాత్రి క్వాలిస్ వాహనం అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పూర్తి వివరాల్లోకి వెలితే.. శంకర్‌పల్లి మండలం దోబీపేట్ గ్రామానికి చెందిన ఆరుగురు యువకులు చరణ్, వివేక్, మహేందర్, చింటూ, బబ్లూ, సతీష్‌లు మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో నిర్వహించిన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి అర్ధరాత్రి సమయంలో ముత్తంగి స్వీట్ హార్ట్ హెూటల్‌లో టీ తాగేందుకు వచ్చారు. టీ తాగిన అనంతరం అక్కడి నుంచి యాదగిరిగుట్ట వెళ్లేందుకు ఔటర్ రింగ్ రోడ్డు ఎక్కారు. అయితే వారు ప్రయాణిస్తున్న క్వాలిస్ వాహనం సుల్తాన్‌పూర్ వద్ద అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను పటాన్‌చెరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. గాయపడినవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం సేకరణ, ఇంటింటి సర్వే సవ్యంగా సాగాలి





నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ధాన్యం సేకరణ, పత్తి కొనుగోళ్ళు, ఇంటింటి కుటుంబ సర్వే గ్రూప్-3 పరీక్షల నిర్వహణ సవ్యంగా సాగేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి సూచించారు. రాష్ట్ర డీజీపీ జితేందర్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఎం.మహేందర్‌రెడ్డి, ఇతర రాష్ట్ర స్థాయి అధికారులతో కలిసి ఆమె బుధవారం సాయంత్రం ఆయా జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించరు. ఈ సమీక్షకు సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ మూడు జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర అధికారులు హాజరయ్యారు. గ్రూప్-3 పరీక్షల సన్నద్ధతతో పాటు వరి ధాన్యం సేకరణ, పత్తి కొనుగోళ్లు, ఇంటింటి కుటుంబ సర్వే అంశాల పురోగతిపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రూప్-3 ఎగ్జామినేషన్ నిర్వహణ కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లు, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనల గురించి చైర్మన్ మహేందర్ రెడ్డి తెలియజేశారు.

అనంతరం వరి ధాన్యం సేకరణ సమీక్షలో ధాన్యం కోతలు జరిపే సమయంలోనే ఆటోమేటిక్ ప్యాడీ క్లీనర్లను తప్పనిసరిగా వినియోగించేలా హార్వెస్టర్ల యజమానులకు సూచించాలన్నారు. ప్రతి కేంద్రంలో ధాన్యం ఆరబెట్టే యంత్రాలను అందుబాటులో ఉంచుతూ ధాన్యం సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సీ.ఎస్ కలెక్టర్లకు సూచించారు. కలెక్టర్లతో పాటు ఇతర జిల్లా అధికారులందరూ క్షేత్రస్థాయి పర్యటనల సందర్భంగా విధిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి వాటి పనితీరును పరిశీలించాలన్నారు. పత్తి కొనుగోళ్లను కూడా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతుల విశ్లేషణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేను గడువులోపు పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా కషి చేయాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి సమగ్ర వివరాలు సేకరించేలా చూడాలన్నారు. సర్వే వివరాలు ఆన్లైన్‌లో నమోదు చేసేందుకు అవసరమైన కంప్యూటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లను సిద్ధం చేసి ఈ నెల 16 నుంచి డేటా ఎంట్రీ ప్రారంభించాలని ఆదేశించారు. గ్రూపు-3 పరీక్షలు నవంబర్ 17న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు జరుగుతాయన్నారు. 18న మధ్యాహ్నం సెషన్‌లో పరీక్ష ఉంటుందన్నారు. బయో మెట్రిక్ విధానం ద్వారా వేలిముద్రల సేకరణ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నందున అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకునేలా చూడాలన్నారు. ఉదయం పరీక్షకు సంబంధించి 9.30 గంటల వరకే పరీక్షా కేంద్రంలోనికి వెళ్లేందుకు అనుమతించడం జరుగుతుందన్నారు. అనంతరం గేట్లు మూసివేయాలన్నారు. మధ్యాహ్నం పరీక్షకు సంబంధించి 2.30 గంటల తర్వాత ఎవరినీ లోనికి అనుమతించకూడదని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ తప్ప మరెవ్వరికి పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్, పుస్తకాలు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు తీసుకువెళ్లేందుకు అనుమతించకూడదన్నారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద క్షుణ్ణంగా తనిఖీలు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించాలని చైర్మన్ సూచించారు. ప్రశ్నపత్రాల లీకేజీలు, మాల్ ప్రాక్టీస్ వంటి వాటికి ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఎలాంటి పొరపాట్లు, ఆరోపణలకు తావులేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. దివ్యాంగులైన అభ్యర్థులు తమకు బదులుగా ఇతరులచే పరీక్ష రాసేందుకు అనుమతి కోరిన చోట, అలాంటివారు ఇంటర్మీడియట్ కంటే తక్కువ విద్యార్హత కలిగిన వారితోనే పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుందని, తమవెంట వైకల్యం ధవీకరించే సర్టిఫికెట్ తేవాలని స్పష్టం చేశారు. ఈ సారి కొత్తగా అమలులోకి వచ్చిన నిబంధనను అనుసరిస్తూ స్క్రైబ్‌లను పరీక్షకు 24 గంటల ముందు దివ్యంగులైన అభ్యర్థులతో పరిచయం చేయించాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చే అభ్యర్థులంతా సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడిచేలా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసేయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద మహిళా పోలీసు సిబ్బందిని సైతం నియమించాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లు, అబ్జర్వర్లు, సిట్టింగ్ స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితరులకు పరీక్షల నిర్వహణ తీరు, నిబంధనలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు వీలుగా శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు. అన్ని కేంద్రాలలోనూ సీ.సీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరుగుతాయని, తమ కార్యాలయం కంట్రోల్ రూమ్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష కేంద్రాల నిర్వహణ తీరును పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 4 లక్షల 10 వేల హౌస్ హోల్డ్స్ ఉన్నాయని, వాటికీ అనుగుణంగా 3400 ఎన్యూమరేటర్ బ్లాక్లు గా ఏర్పాటు చేసి ఎన్యూమరేటర్లను నియమించడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 113784 కుటుంబాలను సర్వేలో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఇంటింటి కుటుంబ సర్వే, కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారులు, ఎంపిడిఓలు, తహసీల్దార్లు ఎప్పటి కప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఈనెల 27 వరకు పూర్తి చేసే దిశగా ప్రణాళికా బద్దంగా కుటుంబాలను సర్వే నిర్వహించడం జరుగుతుందని వివరించారు .ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ రూపేష్ , అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, ట్రైనీ కలెక్టర్ మనోజ్, డిఆర్ఓ పద్మజరాణి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ సర్వేపై అపోహలు వద్దు



నవతెలంగాణ-హత్నూర

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేపై ఎలాంటి అపోహలు చెందొద్దని సర్వే ప్రక్రియలో ప్రజలు భాగస్వాములై తమ వివరాలను నమోదు చేసుకోవాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సూచించారు. మండల పరిధిలోని పల్పనూర్, చందాపూర్, కుటుంబ సర్వేను మండల ప్రత్యేక అధికారి జిల్లా పరిషత్ సీఈఓ స్వప్న, మండల అభివృద్ధి అధికారి శంకర్‌లతో కలిసి కుటుంబ సర్వేను బుధవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించి వేగవంతం చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వేను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి.. పండించిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. అందుకు రైతులు సహకరించాలని దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం విక్రయించాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు ఉంచేటట్లు జాగ్రత్తగా తీసుకోవాలని ఐకెపి సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎంపీవో యూసుఫ్ అలీ, పంచాయతీ కార్యదర్శి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించొద్దు



పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

ప్రతి కాలనీలో నిరంతరం చెత్త సేకరణ

నవతెలంగాణ-పటాన్‌చెరు

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శించవద్దని, ప్రతి కాలనీలో నిరంతరం చెత్త సేకరణ చేయాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం పటాన్ చెరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిహెచ్ఎంసి అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిహెచ్ఎంసి పరిధిలోని భారతీ నగర్, రామచంద్రపురం, పటాన్ చెరు డివిజన్ల పరిధిలో చెత్త సేకరణకు వినియోగిస్తున్న వాహనాలు సరిగా పనిచేయడం లేదని తెలిపారు. కాలనీలో, రహదారులలో సేకరించిన చెత్తను తక్షణమే సంబంధిత వాహనాలలో తరలించాలని ఆదేశించారు. ప్రతిరోజు ఉదయం నాలుగు గంటల నుండి పారిశుధ్య కార్మికుల విధులు ప్రారంభం కావాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. నూతనంగా ఏర్పాటు అవుతున్న కాలనీలలో సైతం చెత్త సేకరణ చేపట్టాలని ఆదేశించారు. జిహెచ్ఎంసి ఉన్నత అధికారులతో పాటు పారిశుద్ధ్య విభాగం అధికారులు ప్రతి రోజు ఉదయం కాలనీలలో విధిగా తనిఖీలు చేపటాలని ఆదేశించారు. ఈ సమావేశంలో బల్దియ డిప్యూటీ కమిషనర్ సురేష్, ఏ ఎమ్ హెచ్ విజయ్ కుమార్, రాంకీ సంస్థ జోనల్ ఇంచార్జ్ రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వీక్లీ పరేడ్



పోలీస్ శాఖలో ఫిజికల్ ఫిట్నెస్ చాలా కీలకం

జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

నవతెలంగాణ-సంగారెడ్డి

ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వీక్లీ పెరేడ్ నిర్వహి స్తున్నట్టు జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న హెూమ్ గార్డ్స్‌కు బుధవారం దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. హెూమ్ గార్డ్స్‌కు పరేడ్ నిర్వహించి, డ్రిల్ చెక్ చేసినట్టు చెప్పారు. ప్రతీరోజు వ్యాయామం ఆరోగ్యానికి శ్రేయస్కరమన్నారు. శారీరకంగా శక్తి సామర్థ్యాలతో ఉన్నప్పుడే ఎలాంటి విధులనైనా ధైర్యంగా నిర్వహించగలమన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేస్తూ.. శారీరకంగా ఫిట్‌గా ఉండాలని సూచించారు. విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి, తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. వ్యక్తిగత లేదా డ్యూటీ పరంగా ఎలాంటి సమస్యలున్నా.. అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎలాంటి సమస్యలున్నా జిల్లా పోలీసు శాఖ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలను అందించడం జరుగుతుందన్నారు.ప్రత్యేక అర్హతలున్న సిబ్బంది ముందుకు రావాలని, వారి అర్హత, ప్రతిభ ఆధారంగా డ్యూటీలను కేటాయించడం జరుగుతుందన్నారు. అదనపు ఎస్పీ సంజీవరావు, ఆర్మ్డ్ రిజర్వ్ డీఎ స్పీ నరేందర్, ఆర్ఐలు రాజశేఖర్‌రెడ్డి, డానియెల్, ఆర్ఎస్ఐలు ఉన్నారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు



అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ

ప్రభుత్వ భూములోకి వచ్చిన ప్రైవేటు వెంచర్ హద్దులు, రోడ్ల తొలగింపు

నవతెలంగాణ-అమీన్‌పూర్

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ హెచ్చరించారు. అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని సర్వే నంబరు 1064, 997లోని ప్రభుత్వ భూముల్లోకి చొచ్చుకొచ్చిన ఓ వెంచర్‌కు సంబంధించిన రోడ్లు, హద్దురాళ్లను మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, సర్వేయర్ నేతృత్వంలో బుధవారం తొలగించారు. ప్రభుత్వ భూమి హద్దు వరకు ట్రెంచ్ కొట్టారు. ప్రభుత్వ భూమిని అనుకుని ఏర్పాటు చేసిన లేఔట్‌కు సంబంధించిన వ్యక్తులు తమ హద్దులు దాటి ప్రభుత్వ భూమిలోకి వచ్చారు. ఇది గమనించిన రెవెన్యూ అధికారులు సదరు లేఔట్ రహదారులను తొలగించారు. ఇదిలావుంటే.. వెంచర్లు ఏర్పాటు చేసే సమయంలోనే అధికారులు అలర్ట్‌గా ఉండి ప్రభుత్వ భూముల్లో వెంచర్లు ఏర్పాటు చేయకుండా చూడాలని పలువురు ప్రజలు కోరుతున్నారు. అధికారులు అనుమతి ఇచ్చారనే ఉద్దేశ్యంతో సామాన్యులు ప్లాట్లను కొనుగోలు చేసి తీరా అసలు విషయం తెలిసి మోసపోతున్నారని వాపోయారు. హైడ్రా విషయంలో ఇదే జరిగిందని, ఇకనైనా జరగకుండా ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, శిఖం భూమల విషయంలో అప్రమత్తంగా అధికారులు వ్యవహరించాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇనెస్పెక్టర్ రఘునాథరెడ్డి, సర్వేర్ బాలరాజు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేపాల్ వేదికపై గీతం ఖ్యాతి



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శిఖలో మరో కలికితురాయి చేరింది. గీతం విద్యార్థిని మహితా కొండూరు మన దేశం తరపున సాంస్కృతిక రాయబారిగా నేపాల్ లో పర్యటించి, అక్కడి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసా పత్రాన్ని పొందారు. ఈ విషయాన్ని గీతం ఎన్.సీ.సీ. కేర్ టేకర్ ఆఫీసర్ ఎస్.అజయ్ కుమార్ బుధవారం వెల్లడించారు. నేపాల్‌లో అక్టోబర్ 21 నుంచి 29 వరకు నిర్వహించిన ఎన్.సీ.సీ. యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్ (వైఈపీ)లో సీనియర్ అండర్ ఆఫీసర్ మహిత కొండూరి విజయవంతంగా పాల్గొన్నారని, మన దేశం నుంచి మొత్తం 16 మందిని క్యాడెట్‌లను ఎంపిక చేయగా, అందులో మన తెలుగు రాష్ట్రాల నుంచి మహిత ఒక్కరే ప్రాతినిధ్యం వహించినట్టు ఆయన వివరించారు. మహిత నేపాల్ లో ఉన్న సమయంలో అనేక కార్యకలాపాలలో పాల్గొనడమే గాక, సాహసోపేతమైన 'జంగిల్ సఫారీ'లో కూడా పాల్గొన్నట్టు తెలిపారు. ఆమె అంకితభావం, శ్రేష్టమైన ప్రదర్శనలను గుర్తించిన నేపాల్ లోని ఎన్.సీ.సీ. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ సురేశ్ కుమార్ కర్కి ఆమె విశిష్ట సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాన్ని స్వయంగా అందజేశారన్నారు.నేపాల్ లో మహిత అనుభవం ఆమె వ్యక్తిగత అభివృద్ధిని మెరుగు పరచడమే కాకుండా, విభిన్న నేపథ్యాల నుంచి వచ్చిన క్యాడెట్ ల మధ్య గొప్ప స్నేహాన్ని, ఆలోచనల మార్పిడిని కూడా ప్రోత్సహించినట్టు తెలిపారు. భారతదేశ సాంస్కృతిక రాయబారిగా మహిత సాధించిన విజయాలు, ఆమె నిర్వహించిన పాత్రను గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, క్రీడలు-ఎన్.సీ.సీ. డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమార్ ఉపాధ్యాయులు ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని.. కొత్త రుణాలు ఇచ్చేందుకు షెడ్యూల్ ప్రకటించాలని, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అశోక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని దరఖాస్తులు చేసుకోవటం జరిగిందని.. కానీ రుణాలు ఇవ్వలేదన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని గత ప్రభుత్వం దళిత బందు అమలు చేసున్నామని కార్పొరేషన్ రుణాల లబ్ధిదారులను నిర్లక్ష్యం చేసిందని.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం కూడా అంబేద్కర్ అభయ హస్తం పేరుతో దళిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.12లక్షలు ఇస్తామని చెప్పిందని కానీ ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు. వెంటనే అది అమలు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారులకు రుణాలు మంజూరు చేయాలని.. కొత్త రుణాల కోసం ప్రభుత్వం వేంటనే షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు న్యాయవాది కే. శుభాష్, శివకుమార్, జిల్లా కమిటీ బి. దత్తు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యుల అరెస్టు





- 2 సెల్ ఫోన్లు, రూ. 10 లక్షలు విలువ చేసే
- 10.3 కిలోల గంజాయి స్వాధీనం


జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ డివిజనల్ పోలీస్ కార్యాలయ పరిధిలో అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా సభ్యులు రంజన్ కుమార్ (30), శ్రీధర్ సాహూ (29) లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పీ మాట్లాడారు. నమ్మదగిన సమాచారం మేరకు మనోహరాబాద్ ఎస్ఐ బి.సుభాష్ గౌడ్ తన సిబ్బందితో మనోహరాబాద్ మండలం జీడిపల్లి వద్ద 44 వ జాతీయ రహదారి అండర్ పాస్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే రంజన్ కుమార్ (30) పోలీసులను చూసి గంజాయి ఉన్న ప్లాస్టిక్ కవర్‌ను పొదల్లో పడవేసి పారిపోయేందుకు యత్నించారు. వెంటనే పోలీసులు రంజన్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, శ్రీధర్ సాహూ (29) వద్ద గంజాయి తీసుకొని విక్రయిస్తున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి విచారించి వారి వద్దనున్న 2 సెల్ ఫోన్లు, రూ. 10 లక్షలు విలువ చేసే 10.3 కిలోలు గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. గంజాయి వ్యాపారం నిర్వహిస్తూ, పట్టుబడ్డ ఇద్దరూ దండుపల్లి ఐటిసి పైపుల కంపని డ్రైవర్లుగా పని చేస్తున్నారని తెలిపారు. పట్టుబడ్డ ఇద్దరు గంజాయి ముఠా సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. గంజాయి ముఠా సభ్యులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన మనోహరాబాద్ ఎస్సై బి.సుభాష్ గౌడ్, కానిస్టేబుల్‌లు ప్రసాద్, అనిల్, శ్రీనివాస్ గౌడ్, బిక్షపతిలను జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకట్ రెడ్డి, సీఐ రంగకృష్ణ, ఎస్ఐలు సుభాష్ గౌడ్, శివానందం, పోలీస్ కానిస్టేబుల్‌లు ప్రసాద్, అనిల్, శ్రీనివాస్ గౌడ్, బిక్షపతిలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి





(ఫైల్)

కారు టైరు పగిలి డివైడర్ దాటి ఆర్టీసీ బస్సుకు ఢీ

నవతెలంగాణ-చిన్నకోడూరు

ప్రమాదవశాత్తు కారు ముందు టైరు పగిలి డివైడర్ దాటి అపసవ్య దిశలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు ఢీ కొట్టింది. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల పరిధిలోని ఇబ్రహింనగర్ శివారులో రాజీవ్ రహదారిపై చోటు చేసుకున్న ఈ ఘటనలో కారు నడుపుతున్న పోలీస్ కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాద సంఘటనకు సంబంధించి చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక మండలం రామక్కపేట గ్రామానికి చెందిన పెంబర్తి నవీన్(38) సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోహెడ ఠాణాలో విధులు నిర్వహిస్తున్నారు. యధావిధిగా మంగళవారం రాత్రి తన డ్యూటీ ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో మార్గం మధ్యలో ఇబ్రహీంనగర్ క్రాస్ రోడ్డు వద్దకు రాగానే అతను నడుపుతున్న స్విఫ్ట్ కార్ ముందు భాగంలోని టైర్ పగిలి అదుపు తప్పి డివైడర్‌ని ఢీకొని, కారు రోడ్డుకి అవతలి వైపు వెళ్లి ఎదురుగా సిద్దిపేట నుండి కరీంనగర్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో కానిస్టేబుల్ నవీన్ (38)కు తీవ్ర రక్త గాయాలై అక్కడక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య సౌమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కానిస్టేబుల్ మృతి పట్ల సంతాపం

నవతెలంగాణ-సిద్దిపేట

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ నవీన్ మృతి పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం పట్టుదలతో సంపాదించి, అదే పట్టుదలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను నవీన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమన్నారు. తన ఉద్యోగం సామజిక బాధ్యతగా, ఒక నిబద్ధతతో పని చేసాడని కానిస్టేబుల్ నవీన్ సేవలను కొనియాడారు. నవీన్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు, అతని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, అండగా ఉంటానన్నారు.

గ్రూప్ 3 పరీక్ష ఏర్పాట్లను పరిశీలించిన తహశీల్దార్



నవతెలంగాణ-తూప్రాన్

రాష్ట్ర వ్యాప్తంగా నవంబర్ 17,18న నిర్వహించే గ్రూప్-3 పరీక్షకు సంబంధించిన తూప్రాన్ పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను తహశీల్దార్ విజయలక్ష్మి బుధవారం పర్యవేక్షించారు. గ్రూప్ 3 పరీక్షలకుగాను తూప్రాన్‌లో రెండు కేంద్రాలను ప్రభుత్వ అధికారులు ఎంపిక చేశారు. తూప్రాన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లలో నిర్వహించే గ్రూప్ 3 పరీక్ష ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 288 మంది, శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో 288 మంది గ్రూప్ 3 అభ్యర్థులు నవంబర్ 17,18 న పరీక్షలు రాయనున్నారు. నవంబర్ 17న ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3.00 గంటల నుంచి 5.30 నిమిషాల వరకు, నవంబర్ 18న ఉదయం 10 గంటల నుంచి 12.30 నిమిషాల వరకు మొత్తం మూడు సెషన్లో పరీక్షలు జరగనున్నాయి. గ్రూప్ 3 పరీక్ష రాసే అభ్యర్థులు 9 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా పరీక్షకు అనుమతి ఉండదని అధికారులు తెలిపారు. పరీక్షలకు సెల్ ఫోన్లు,ఇతర ఎలక్ట్రానిక్, జామెట్రీ వస్తువులకు అనుమతి లేదన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు హాల్ టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, లైసెన్స్, పాన్ కార్డు లాంటి గుర్తింపు పత్రాలను తీసుకురావాలన్నారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ విజయలక్ష్మి తెలిపారు. రెవెన్యూ శాఖలోని జూనియర్ అసిస్టెంట్లు ఆంజనేయులు, సతీష్,రాజు, మంజుల లు పరీక్షా కేంద్రాలలో విధులు నిర్వహించనున్నారు. గ్రూప్ 3 పరీక్షలకు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ జగదీశ్వర్ చీఫ్ సూపరిండెంట్‌గా వ్యవహరించనున్నారు. తూప్రాన్ ఆర్డిఓ జయచంద్ర రెడ్డి పరీక్షా కేంద్రాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మన్నె ప్రభుదాస్, ఎస్ఐ శివానందం, కళాశాల, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


పురుగుల మందు తాగి వ్యక్తి మృతి



నవతెలంగాణ-రాయపోల్

అప్పుల బాధలు, కుటుంబ కలహాలతో కలత చెంది వ్యక్తి మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండలం ఇందు ప్రియాల్ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. దౌల్తాబాద్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామానికి చెందిన పోతరాజు రామస్వామి (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. వ్యవసాయం, కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేశారు. ఆ అప్పులు తీర్చే మార్గం కనబడక కుటుంబ సభ్యుల మధ్య గొడవలు కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై రామస్వామి మంగళవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పూర్తయిన తర్వాత పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. రామస్వామి గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి సాయవ్వ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ తెలిపారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి



నవతెలంగాణ-అమీన్‌పూర్

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించి మంచి గుర్తింపు పొందాలని అమీన్‌పూర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ నందారం నర్సింహాగౌడ్ అన్నారు. బుధవారం అమీన్‌పూర్ మున్సిపాల్టీ పరిధిలోని బీరంగూడలో కొత్తగా ఏర్పాటు చేసిన మొబైల్ దుకాణాన్ని బుధవారం ప్రారంభించి మాట్లాడారు. కస్టమర్లకు నాణ్యమైన సేవలు అందించి వారి మన్ననలను పొందాలన్నారు. వినియోగదారుల ప్రేమాభిమా నాలను చూరగొన్నప్పుడే పది కాలాల పాటు మంచిగా బిజినెస్ చేసుకునే అవకా శం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రేశం జ్ఞానేశ్వర్, సుధాకర్, శ్యామ్, మొబైల్ దుకాణం యజమాని తదితరులు పాల్గొన్నారు.


2039 కుటుంబాల సర్వే నమోదు



నవతెలంగాణ-న్యాల్‌కల్

ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో ఇప్పటివరకు 2039 కుటుంబాల వివరాలు నమోదు చేసినట్టు ఎంపీడీవో రాజశేఖర్ తెలిపారు. అన్ని గ్రామాల్లో మండల ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, మండల ఉప తహసీల్దార్ రాజిరెడ్డి పర్యవేక్షణలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుంది. మండల వ్యాప్తంగా 112 ఎన్యూమరేటర్లు 11 మంది సూపర్వైజర్లు సర్వే నిర్వహిస్తున్నారు. ఈనెల 18తో సర్వే గడువు ముగుస్తుండడంతో.. దూర ప్రాంతాల వలస ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సర్వే గడువు పెంచాలని కోరుతున్నారు. పొరపాట్లు లేకుండా సర్వే అధికారులు జాగ్రత్తగా సమగ్ర వివరాలు నమోదు చేసుకోవాలని ఉపతహసీల్దార్ రాజిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వే అధికారులున్నారు.

ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి ఓ వరం



నవతెలంగాణ-జహీరాబాద్

ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న వారికి ఓ వరంలా ఉపయోగపడుతున్నదని పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ ఉజ్వల్ రెడ్డి అన్నారు. కోహీర్ మండలం బడంపేట గ్రామానికి చెందిన సజ్జాపూర్ నర్సింహులు అనారోగ్య సమస్యతో నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. చికిత్స నిమిత్తం (రెండు లక్షల యాభై వేల రూపాయలు) ఖర్చు వస్తుందని వైద్యులు తెలుపడంతో.. ఆర్థిక స్తోమత సరిగ్గా లేకపోవడంతో తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మెన్ యన్.గిరిధర్‌రెడ్డిని బాధితుడు సంప్రదించాడు. ఆయన వెంటనే స్పందించి వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజ నర్సింహ, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటొండ్డిల సహకారంతో బాధితుడు నర్సింహులుకి ముఖ్య మంత్రి సహాయనిధి కింద రూ.2.50లక్షలను ఎల్ఓసీని విడుదల చేయించారు. ఆ ఎల్ఓసీని జహీరాబాద్ పార్లమెం ట్ సీనియర్ నాయకులు డా.సిద్దం ఉజ్వల్‌రెడ్డి బాధితుడి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఈ కార్యక మంలో కాంగ్రెస్ పార్టీ కోహీర్ మండలాధ్యక్షులు రాంలింగా రెడ్డి, సీడీసీ చైర్మెన్ ముబీన్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని పెద్దలోడి గ్రామానికి చెందిన టి.మల్లేశానికి రాయికోడ్ వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు బుధవారం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశానుసారం లబ్దిదారుడికి రూ.45,000 చెక్కు అందించారు.ఈ కార్యక్రమంలో మునిపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎల్లా గౌడ్, రేగోటి నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-కోహీర్

మండలంలోని గత నాలుగు నెలల నుంచి కార్మికులకు వేతనాలు లేక ఇబ్బంది పడుతున్నారని.. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె రెండోరోజుకు చేరింది. గ్రామ పంచాయతీలో 23 మంది కార్మికులకు వేతనాలు అందక నానా అవస్థలు పడుతున్నారన్నారు. 'పని పూర్తయింది, మాకు డబ్బు కావాలి.. డబ్బులేక ఇబ్బంది పడుత ంంటే మా పిల్లలు ఏమి తింటారు. ఇంకా చాలా అవసరాలు చెల్లించాలి' అంటూ ఓ ఉద్యోగి వాపో యాడు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాడు. ఈ ధర్నాలో లక్ష్మణ్ రావు, సంజీవ్, నరసింహులు, ఘనీ మియాన్, ముహమ్మద్, ముజఫర్ రవి, యాద్మాన్, పూచ్‌మన్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ కుమారుడి వివాహానికి హాజరైన ప్రముఖులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణం పస్తాపూర్ గ్రామంలోని ఎస్‌వి కన్వెన్షన్‌లో బుధవారం జరిగిన డాక్టర్ సోమ.చంద్రశేఖర్, డాక్టర్ నాగరాణి దంపతుల తనయుడు వివాహ వేడుకలకు పలువురు ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. హాజరైన వారిలో జహీరాబాద్ పార్లమెంట్ సీనియర్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్ రెడ్డి, జహీరాబాద్ సీడీసీ చైర్మెన్ ముబీన్, జహీరాబాద్ మండలాధ్యక్షులు పి.నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీకాంత్ రెడ్డి, నారాయణరెడ్డి, రంగా అరుణ్ కుమార్, మహంకాళి శుభాష్ గుప్తా తదితరులున్నారు.



కలెక్టర్‌ను కలిసిన గ్రంథాలయ చైర్మెన్

నవతెలంగాణ-రాయికోడ్

నూతనంగా ఎన్నికైన జిల్లా గ్రంథాలయ చైర్మెన్ గొల్ల అంజయ్య సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. జిల్లాలో త్వరలోనే గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ వారోత్సవాల్లో పాలొనాలని ఆహ్వానించారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న పులిమామిడి రాజు

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలోని శ్రీ బాలాజీ గార్డెన్స్‌లో బుధవారం జరిగిన పండాల శారద, జగన్నాథం దంపతుల ద్వితీయ కూతురు వివాహ వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతోపాటు మాలె శ్రీనివాస్, చీలం సురేష్, జగదీశ్వర్ పంతులు, బాంచ సతీష్, మేకల సంగమేశ్వర్, నెల్లి కృష్ణ, పొన్న రాములు, ప్రింటింగ్ ప్రెస్ రవి, పీఎంఆర్ యువసేన నాయకులు రాగం అనిల్, తాలెల్మ రాము, నల్ల ఆనంద్, సోమ శంకర్, అఖిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణవేణి టెక్నో స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

నవతెలంగాణ-సదాశివపేట

సదాశిపేటలోని కృష్ణవేణి టెక్నో స్కూల్ యజమాన్యం ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని.. కాబట్టి వెంటనే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఈఓ శంకర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ.. కృష్ణవేణి పాఠశాల అధిక ఫీజుల దోపిడీతో విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడుతున్నదని ఆరోపించారు. వెంటనే ఆ యజమాన్యంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్లు ఇప్పించాలన్నారు. లేనియెడల పెద్దఎత్తున పాఠశాల ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు ఆంజనేయులు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఈనెల 15న టీపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

నవతెలంగాణ-సంగారెడ్డి

తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సమావేశం ఈనెల 15న ఉదయం 10 గంటల నుంచి సంగారెడ్డిలోని ఉపాధ్యాయ భవన్‌లో జరుగుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు నాసర్ పటేల్‌లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్, ప్రత్యేక ఆహ్వానితులుగా రాష్ట ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు యం. ప్రకాశరావు, ఎన్నికల అధికారిగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్‌లు హాజరవుతారు. ఈ సమావేశానికి జిల్లాలోని వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా కౌన్సిలర్లు హాజరు కావాలని కోరారు. అనంతరం నూతన కమిటీకి ఎన్నికలుంటాయని తెలిపారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కును పంపిణీ

నవతెలంగాణ-మనూర్

మండల పరిధిలోని బోరంచ గ్రామానికి చెందిన భూమయ్యకు రూ.36,500 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును యువనేత సాగర్ షెట్కార్ బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుభాష్ పటేల్, నారాయణ, శివకాంత్ పటేల్, శివయ్య స్వామి, కాలేద్, శివ తదితరులు ఉన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

నవతెలంగాణ-హత్నూర

మండలంలోని చింతల్‌చెరువు గ్రామంలో 'శ్రీ సరస్వతీ విద్యా మందిర్'లో 2024 గీతా జయంతి సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు - తిరుపతి వారిచే డిసెంబర్ 9వ తేది ఉ:10.గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు జిల్లా స్థాయిలో శ్రీమద్ భగవద్గీతలోని ఆరో అధ్యాయం సంయమ యోగములోని శ్లోకాలపైన 6వ, 7వ మరియు 8వ, 9వ తరగతులకు కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్టు టీటీడీ సంగారెడ్డి జిల్లా కార్యక్రమ నిర్వాహకులు కే. లక్ష్మీ నారాయణ శర్మ తెలిపారు. తదనంతరం ఈ విభాగాలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, మరియు తృతీయ బహుమతిలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన విద్యార్థులు "శ్రీ సరస్వతీ విద్యా మందిర్ (చింతల్ చెరు) "ప్రధానాచార్యులు రమేష్ 9948331456, లేదా లక్ష్మీ నారాయణ శర్మ టీటీడీ సంగారెడ్డి కార్యనిర్వాహకులు 9440214296 వీరిని సంప్రదించాలని తెలిపారు.

గ్రూప్-3 పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలి

- సంగారెడ్డి జిల్లాలో 49 కేంద్రాల్లో పరీక్ష
- హాజరైతున్న అభ్యర్థులు 15123
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



నవతెలంగాణ-సంగారెడ్డి

టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అధికారులకు సూచించారు. టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్షల నిర్వహణపై రీజినల్ కోఆర్డినేటర్స్, స్ట్రాంగ్ రూమ్, జాయింట్ కస్టోడియన్స్, పోలీస్ నోడల్ ఆఫీసర్స్, చీఫ్ సూపరింటెండెంట్స్, డీఓ, ఫ్లైయింగ్ స్క్వాడ్స్, జాయింట్ రూట్ ఆఫీసర్స్‌తో బుధవారం నిర్వహించిన ట్రైనింగ్ కమ్ కో ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 17న ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్) పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారన్నారు. సాయంత్రం 3.00 గంటల నుండి 5.30 గంటల వరకు పేపర్ -2 హిస్టరీ, పోలిటి అండ్ సొసైటీ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రం గేట్లు మధ్యాహ్నం 2.30 గంటలకు మూసివేస్తారన్నారు. 18న ఉదయం 10. 00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-3 ఎకానమీ అండ్ డెవలప్మెంట్ పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రం గేట్లు ఉదయం 9.30 గంటలకు మూసివేస్తారన్నారు. ఈ పరీక్షలు సజావుగా, ప్రశాంతంగా జరిగేలా పగడ్బందీగా చర్యలు చేపట్టాలని సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు ఉదయం 8:30 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాల న్నారు. నిర్దేశించిన సమయం తర్వాత అభ్యర్థులెవరిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించరన్నారు. సంగారెడ్డి జిల్లాలో 15123 మంది అభ్యర్థులు టీజీపీఎస్సీ గ్రూప్3 పరీక్ష రాస్తున్నారని వీరి కోసం 49 కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అభ్యర్థులు నలుపు/నీలం బాల్‌పాయింట్ పెన్నులు, పెన్సిల్, ఎరేజర్, హాల్ టికెట్‌తో సెంటర్‌కు రావాలన్నారు. హాల్ టిక్కెట్‌పై ఫోటో అతికించాలని.. అలాగే ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఏదైనా ఐడీకార్డు తీసుకురావాలన్నారు. అన్ని సమాధానాలు బాల్ పాయింట్ పెన్ (నీలం/నలుపు)తో మాత్రమే రాయాలన్నారు. సెల్‌ఫోన్, చేతి గడియారాలు, క్యాలిక్యులేటర్‌తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు తీసుకురావొద్దన్నారు. ట్రాఫిక్ దృష్టిలో ఉంచుకొని అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అభ్యర్థులు టీజీపీఎస్సీ సూచనలు పాటించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు. పరీక్ష జరిగేటప్పుడు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, పరీక్ష ఎంట్రెన్స్ గేట్, పరిష కేంద్రాలు టేబుల్, చేర్స్ సానిటైజ్ చేయాలని, పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఏఎన్ఎం, మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ సమాజంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ , అదనపు ఎస్పీ సంజీవరావు, జాయింట్ కస్టోడియన్, చీఫ్ సూపర్డెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ తదితరులు పాల్గొన్నారు.



రామదూత కాటన్ మిల్ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-హత్నూర

మండలంలోని బోరపట్ల గ్రామ శివారులో గల రామదూత కాటన్ మిల్ పరిశ్రమలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని జోగిపేట్ మార్కెట్ కమిటీ చైర్మెన్ జగన్ మోహన్ రెడ్డి, సీసీఐ ఇన్చార్జి శక్తివెల్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పత్తిని విక్రయించాలన్నారు. దళారులను ఆశ్రయించొద్దని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జోగిపేట్ మార్కెట్ కమిటీ కార్యదర్శి సునీల్ కుమార్, నర్సాపూర్ కార్యదర్శి ప్రతాప్ రుద్ర గౌడ్, మండల విస్తీర్ణ అధికారి మహేందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలోని ప్రవేట్ ఆసుపత్రుల్లో అధికారుల తనిఖీ



నవతెలంగాణ-సంగారెడ్డి

స్టేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పుష్పవాణి ఆధ్వర్యంలో జిల్లాలోని శ్రీ ధరణి, స్టార్ హాస్పిటల్స్, కీర్తి హాస్పిటల్‌లను బుధవారం క్షుణ్ణంగా పరిశీలించి వివిధ రికార్డులను తనిఖీ చేశారు. దానికి సంబంధించిన జిరాక్స్ కాపీలను తీసుకొని వాటిని పరిశీలించి నివేదికను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కి అందజేసిన తర్వాత ఏవైనా లోపాలు ఉంటే.. దానిపై తగు చర్యలకై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి పంపిస్తామని సదరు అధికారులు తెలిపారు. ఈ హాస్పిటల్‌లో వివిధ శాఖల అనుమతి పత్రాలను పరిశీలించారు. వారు అందిస్తున్న చికిత్స సేవలను వాటిపై వారు వసూలు చేస్తున్న రుసుములను వాటికి సంబంధించిన బిల్స్, కే సీట్లను పరిశీలించారు. హాస్పటల్లో ప్రదర్శించిన ధరల పట్టికలతో పోల్చి చూశారు. ఆ హాస్పిటల్లో ఫైర్ సేఫ్టీ విధానాల్ని బయో మెడికల్ వేస్ట్ డిస్పోజల్, హాస్పిటల్లో పనిచేయుచున్న సిబ్బంది వివరాలు.. వారి సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గాయత్రీ దేవి, మాస్ మీడియా ఆఫీసర్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వి.రవి, స్టేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ టాస్క్ ఫోర్ కమిటీ మెంబర్స్ సునీల్ రాజ్, సిపెచ్‌ఓ, రమా దేవి, డిఎస్ఓ, అనిల్ కుమార్, వెంకట్ రామ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరు ఓటర్ నమోదు చేసుకోవాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

అర్హులైన యువతీ యువకులందరు ఓటర్‌గా నమోదు చేసుకోవాలని ఓటర్ నమోదు అధికారి దేవుజా అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగిన రాజకీయ పార్టీల ప్రతినిధుల ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఎస్ఆర్ -2025) సమావేశంలో దేవుజా మాట్లాడుతూ.. ఈనెల 23, 24 తేదీల్లో జరిగే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో అర్హులైన అందరూ ఓటరు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అభ్యంతరాలు ఉంటే 24న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో స్వీకరిస్తారని.. తుది ఓటరు జాబితా జనవరి 6న పబ్లిష్ అవుతుందన్నారు. అలాగే(ఎమ్మెల్సీ -2025)ఎమ్మెల్సీ పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల నియోజకవర్గముల ఓటరులకు సంబంధించి ఈ నెల 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ఉన్నందున వాటిపైన ఏమైనా అభ్యంతరాలు ఉంటే.. ఈనెల 23 నుంచి డిసెంబర్ 09 వరకు అర్జీ చేసుకోవచ్చని, డిసెంబర్ 25 వరకు అభ్యంతరాలను పరిష్కరించి సప్లిమెంటరీ జాబితాను ఎమ్మెల్సీ పట్టభద్రుల మరియు ఉపాధ్యాయుల నియోజకవర్గముల ఓటరుల తుది ఓటరు జాబితా డిసెంబర్ 30న తుది జాబితా పబ్లిష్ వెలువడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రంగారావు, ఎలక్షన్ డిటి సంతోష్ కుమార్, తోపాటు రాజకీయ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొల్కురి నరసింహారెడ్డి, బిజెపి నాయకులు శివకుమార్ యాదవ్, మోహన్ కుమార్, బీఎస్పీ పార్టీ నాయకులు ప్రశాంత్ కుమార్, సీపీఐ(ఎం) నాయకులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ నిబంధనలతో అధిక ఉత్పత్తి సాధ్యం



నవతెలంగాణ-జహీరాబాద్

శాస్త్రీయ నిబంధనలతో అధిక ఉత్పత్తి సాధ్యమని కెవికె శాస్త్రవేత్త రమేష్ అన్నారు. డీడీయస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మొగుడంపల్లీ మండలం ఉప్పర్పల్లి తండా, న్యాల్కల్ మండలం మామిడ్గి, శంశల్లాపూర్ గ్రామాల్లో, ఝరాసంగం మండలం పోట్పల్లి గ్రామంలో, కంగ్టి మండలం, నాగూరు కె మరియు కిసాన్ నాయిక్ తాండాలో రైతు శిక్షణ కార్యక్రమంలో భాగంగా లింగాకర్షక బుట్టలు, వేప నూనె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వి.రమేష్ మాట్లా డుతూ.. రైతులకు ఇచ్చిన కంది రకం (టి డి ఆర్ జి -59) ఫ్యూజేరియం ఎండు తెగులును తట్టుకుంటుందన్నారు. స్టేరిలిటీ మొజాయిక్ వైరస్ తెగులును బాగా తట్టుకుంటుం దన్నారు. మారుకా మచ్చల పురుగు మరియు శనగ పచ్చ పురుగును నివారించడానికి లీటరు నీటికి 5 మి.లీ వేప నూనె పిచికారి చేయాలన్నారు. ఉధృతి ఎక్కువ ఉంటే దశపర్ణి కాషాయం 5 లీటర్లు ఎకరాకు సరిపోయే నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలు అమర్చి పురుగు ఉధృతిని నివారించవచ్చు అన్నారు. ఎండు తెగులు నివారించడానికి తట్టుకునే రకాలు ఆశ, హనుమ, మన్యంకొండ కంది, మారుతి వేసుకోవాలన్నారు. ఎండు తెగులు నివారించడానికి ట్రికోడర్మ విరిడి 10 గ్రాములు కిలో విత్తనానికి పట్టించి విత్తుకోవాల న్నారు. 110 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 175 ఎకరాలకు 1400 లింగాకర్షక బుట్టలు మరియు 125 లీటర్ల వేప నూనె పంపిణీ చేశారు.

కుటుంబ సర్వేను విజయవంతం చేద్దాం



నవతెలంగాణ-రామచంద్రాపురం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతం చేద్దామని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ పిలుపునిచ్చారు. పట్టణంలోని రామచంద్రారెడ్డి నగర్ కాలనీలో బుధవారం కుటుంబ సర్వే కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. మొదట కార్పొరేటర్ నివాసంలో అధికారులు సర్వే వివరాలను సేకరించారు. అనంతరం కాలనీలోని ఇంటింటికి తిరుగుతూ సర్వే వివరాలను అడిగి సేకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో కుటుంబ సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారన్నారు. పేద ప్రజల అభివృద్ధి కోసం కుల గణన కుటుంబ సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నదన్నారు. సమగ్ర కుటుంబ సర్వేతో బడుగు, బలహీన వర్గాలు సామాజికంగా ఆర్థికంగా రాజకీయపరంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. స్వాతంత్రం వచ్చాక దేశంలోనే మొట్టమొదటిసారి తెలంగాణ ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ, కుల గణన కార్యక్రమం చేపట్టిందని అన్నారు. ప్రజలు అధికారులకు సహకరించి తమ వివరాలను సక్రమంగా అందించాలని ఈ సందర్భంగా కార్పొరేటర్ కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాగభూషణం, తిరుమల గౌడ్, బుచ్చి రెడ్డి, వాసుదేవ్, చందు, మాధవ రెడ్డి, రాజశేఖర్, నిరంజన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంతానోత్పత్తికి నిబంధనలు పాటించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

పశువుల సంతానోత్పత్తిని పెంచేందుకు నియమ నిబంధనలు పాటించాలి పశు వైద్యాధికారి డాక్టర్ అజంతా అన్నారు. జహీరాబాద్ మండల పరిధిలోని ఆనెగుంట గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ, డీడీఎస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చరక్‌పల్లి పశు వైద్యధికారి డా. అజింక్య మాట్లాడుతూ.. గోపాలమిత్ర సేవలు వినియోగించుకోవాలని పశువులు రోగాల బారిన పడకుండా ముందు జాగ్రత్తగా టీకాలు చేసుకోవా లన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం పశు సంవర్ధక శాస్త్రవేత్త డాక్టర్ కైలాష్ మాట్లాడుతూ.. పాల ఉత్పత్తి పెంచుకోవాలని.. పాడి పశువులు అభివృద్ధి చెందాలని.. అందుకోసం పోషకాలు గల మేత దానా, మినరల్ మిక్చర్ పశువులకు అందించాలన్నారు. ఈ శిబిరంలో గర్భకోశ చికిత్సలు సాధారణ చికిత్సలు కృత్రిమ గర్భధారణ, దూడలకు నట్టాల నివారణ చేసారు. పాడి రైతులకు మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గోపాలమిత్ర సూపర్వైజర్ అర్జునయ్య జెవివోలు రాజయ్య, వెంకట్, మోబిన్ ఓఎస్‌లు రవి, ఇస్మాయిల్,శోబమ్మ గోపాల మిత్ర భాస్కర్, కృష్ణ పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష రాజకీయాల్లోకి దండే రమాకాంత్



నవతెలంగాణ-జిన్నారం

క్రియాశీలక ప్రత్యక్ష రాజకీయాల్లోకి త్వరలోనే రానున్నట్టు జిన్నారం మండలం కాజిపల్లి ఆర్కే ఫౌండేషన్ చైర్మెన్ అడ్వకేట్ దండే రమకాంత్ ప్రకటించారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. మెదక్ జిల్లా పరిషత్ మాజీ చైర్మెన్ తన తండ్రి దండే రామకృష్ణ స్పూర్తితో ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వస్తున్నట్టు చెప్పారు. ఇప్పటికే ఆర్కే ఫౌండేషన్ నేతృత్వంలో అనేక సామాజిక ప్రజాహితమైన కార్యక్రమాలు కాజిపల్లి కేంద్రంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కాగా శ్రేయోభిలాషులు, మిత్రులు, అనుయాయులు అన్ని వర్గాల సూచనలు, సలహాలు ప్రజానీకం అండదండలు ఆశీస్సులతో ప్రజాభీష్టం మేరకు లోతైన చర్చల తదనంతరం ప్రత్యక్ష రాజకీయ ప్రవేశానికి సంబంధించిన వివరాలను వెల్లడించనున్నట్టు చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానిక ప్రజల ఆశీస్సులతో పోటీ చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అంశం కాజిపల్లి గ్రామంతో పాటు జిన్నారం మండలానికి విస్తృత స్థాయి ప్రజా సేవ పరమైన కార్యక్రమాల ఆశయ సాధనకై మద్దతుదారులతో చర్చించనున్నట్టు చెప్పారు. ఈ క్రమంలోనే విద్య సంబంధిత అంశంలో స్థానిక కాజీ పల్లిలో ప్రభుత్వ పాఠశాలను 10వ తరగతికి అప్‌గ్రేడ్ చేయడం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు రహదారుల అభివృద్ధి, సురక్షిత తాగునీరు జర్నలిస్ట్ కాలనీకి బస్సు, బొల్లారం గ్రామం మీదుగా చందానగర్ నుండి ఖాజీపల్లికి బస్సు,ఖాజీపల్లి కి బస్ డిపో, సీసీరోడ్లు లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. కాజిపల్లితో పాటుగా జిన్నారం మండల అభివృద్ధికి కంకణబద్ధంగా పనిచేస్తామన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజల అండదండలతో ప్రత్యక్ష రాజకీయాల్లో అడుగు పెట్టబోతున్నందుకు సంతోషంగా ఉందని ప్రకటించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



నవతెలంగాణ-జహీరాబాద్

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మహిపాల్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్ఐ జమ చేయాలని, పీఎఫ్ విత్ డ్రా సమస్యపై ఆందోళన నిర్వహించినా పరిష్కరించకుండా, డబ్బుల్ని జమ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవ హరించడం సరికాదన్నారు. ఈ మేరకు నేటి నుంచి సమ్మె చేస్తున్నట్టు చెప్పారు. తక్షణమే పెండింగ్లో ఉన్న ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు జమ చేయాలని, విత్ డ్రా సమస్యని పరి ష్కారం చేయాలన్నారు. లేనియెడల ఈ ఉద్యమాన్ని ఉధృ తం చేస్తామని హెచ్చరించారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు కామ య్య, శ్రీనివాస్, యశోద,చంటి,నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి లక్ష116 విరాళం

నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని బొంతపల్లిలో గ్రామ దేవతలు పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల నిర్మాణానికి తనవంతు సహాయంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మెన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి లక్ష 116 విరాళం అందజేశారు. అలాగే నల్లవల్లి గ్రామ పరిధిలోని పోచమ్మ తల్లి దేవాలయం నిర్మాణానికి రూ.10,116 విరాళాన్ని చెక్కుల రూపంగా అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. దేవాలయాల ఆధ్యాత్మిక కార్యక్రమా లకు ఎల్లప్పుడూ తన వంతు సహకారం ఉంటుందన్నారు. అమ్మవారి కృపతో మండల ప్రజలు నియోజకవర్గ ప్రజలు ఆనందంగా ఉండాలని కోరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, చక్రపాణి, సూర్యనారాయణ, నల్తూరు యాదగిరి, ఎల్లయ్య, బిక్షపతి, విష్ణువర్ధన్, ఆయా గ్రామాల దేవాలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.



ఖరీఫ్ పూర్తి కాక ముందే రబీ

నవతెలంగాణ-చిన్న శంకరంపేట



వర్షాకాలం కోతలు పూర్తికాకముందే రైతులు యాసంగి తూకాలు మొదలుపెట్టారు. వర్షాకాలం వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం ఆలస్యం కావడంతో రైతులు పెద్ద మొత్తంలో వరి విత్తనాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఎస్ కొండాపూర్, మల్లుపల్లి, చందాపూర్, శంకరంపేట, గ్రామాలలోని రైతులకు 200 ఎకరాలకు సరిపడే మేల్ ఫిమేల్ సీడ్ డిస్ట్రిబ్యూషన్ చేసినట్లు సూపర్వైజర్ తెలిపారు. బుధవారం ఎస్ కొండాపూర్ గ్రామంలో కొందరు రైతులు మేల్ ఫిమేల్ తూకాలు వేశారు. వరి ధాన్యం కోతలు మొదలుపెట్టి నెల గడుస్తున్నా కొనుగోలు సెంటర్‌ల వద్ద భారీగా ధాన్యం నిల్వలు ఉన్నాయి. టాపర్లకు వేలకు వేలు కట్టవలసి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి రైస్ మిల్లర్ల వద్ద నిల్వ ఉన్న లారీలను వెంటనే అన్లోడ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

- మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి

నవతెలంగాణ-హవేలిఘనపూర్



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని హవేలి ఘనపూర్ మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి కోరారు. బుధవారం మండల పరిధిలోని ఫరీద్ పూర్, కూచన్ పల్లి గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించే ఉపాధ్యాయులకు ప్రజలు పూర్తి వివరాలు తెలిపి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ నవీన్ కుమార్, సిబ్బంది మహేష్ చంద్ర, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పర్యవేక్షించిన తహశీల్దార్

నవతెలంగాణ-తూప్రాన్



తూప్రాన్ మున్సిపాలిటీలో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో పాల్గొన్న తహశీల్దార్ విజయలక్ష్మి పాల్గొని, సర్వే చేస్తున్న వివరాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని, అందుబాటులో ఉన్న కుటుంబ సభ్యుల సమాచారాన్ని పూర్తిస్థాయిలో సేకరించి, సర్వే ఫార్మాట్లలో తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, సర్వే ఎన్యుమరేటర్లు, ప్రజలు పాల్గొన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-చేగుంట

మండలంలోని బి కొండాపూర్ గ్రామానికి చెందిన దివంగత నిరుడి పరశు రాములు కుమార్తె వివాహం బుధవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో జరిగింది. బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు రంగయ్య గారి రాజిరెడ్డి వివాహనికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దోశల బాలనర్సు, మాజీ ఎంపీటీసీ గూటం నవీన్, తదితరులు పాల్గొన్నారు.

15న మంభోజిపల్లిలో దీపోత్సవం

నవతెలంగాణ-మెదక్ రూరల్



మెదక్ మండల పరిధిలోని మంభోజి పల్లి మల్లన్న స్వామి ఆలయంలో ఈ నెల 15 తేదిన కార్తిక మాసాన్ని పురస్కరించుకొని 41 వేల దీపాలతో దీపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ పూజారి మల్లన్న స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం అర్చనలు, బిల్వార్చనలు, అభిషేకాలు, మధ్యాహ్నం, అన్నదానం నిర్వహించబడుతుందని తెలిపారు. ఆయా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

మత్స్యకారుల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం



నవతెలంగాణ-వెల్దుర్తి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం చేప పిల్లలను ఉచితంగా పంపిణీ చేసిందని, అవి ఎదిగిన అనంతరం విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మెదక్ జిల్లా మత్స్యశాఖ ఫీల్డ్ అధికారి భరత్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కుడి చెరువులో 1.85 లక్షల చేప పిల్లలను, దేవతల చెరువులో 1,85,250 చేప పిల్లలను మత్స్యశాఖ సిబ్బంది బసవరాజ్, యాదగిరి, వ్యవసాయ అధికారి వందనతో కలిసి చెరువులలో వదిలారు. ఎదిగిన అనంతరం విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల మత్స్యకారుల అధ్యక్షుడు బాలరాజ్, మాజీ అధ్యక్షుడు పరమేష్, కార్యదర్శి అశోక్, కోశాధికారి శ్రీనివాస్, కార్యదర్శి నాగేష్, తోపాటు పలువురు ఉన్నారు.

విద్యుత్ షాక్ తగిలి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- గ్రామస్తులు విరాళాలు సేకరించి దహనసంస్కారాలు

నవతెలంగాణ-నిజాంపేట్



మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన కమ్మరి శేఖర్ అలియాస్ శంకర్ (48) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన కమ్మరి శేఖర్ గ్రామంలో ఎలక్ట్రిసిటీ ఉద్యోగులతో కరెంటు పనిపై కూలికి వెళ్తుండేవాడు. ఎవరికి అవసరం ఉన్నా వారు పిలవగానే వెళ్లి కరెంటు స్తంభాలు ఎక్కుతూ వైర్లు బిగించి ఎన్నో కొన్ని డబ్బులు ఇస్తే తీసుకొనేవాడు. సెప్టెంబర్ 10వ తేదిన స్తంభం ఎక్కి కరెంట్ షాక్ తగిలి కింద పడిపోవడంతో వెన్నుపూస విరిగి హైదరాబాద్ గాంధీ హాస్పిటల్‌లో పది రోజులపాటు చికిత్స చేయించుకున్నాడు. తిరిగి నిజాంబాద్‌లోని ప్రైవేటు హాస్పిటల్‌లో 15 రోజులపాటు చికిత్స పొందాడు. అనంతరం చికిత్స కొరకు డబ్బులు లేక మళ్లీ నిజాంబాద్ గవర్నమెంట్ హాస్పిటల్‌లో చేరగా ఐదు రోజులు చికిత్స పొంది, ఆ తర్వాత నస్కల్‌కు వచ్చేశాడు. డబ్బులు లేక అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. శేఖర్‌కు భార్య పద్మ కుమారులు అభిలాష్, నిఖిల్‌లు ఉన్నారు. గ్రామంలోని యువకులు రూ.10 వేలను చందాలు పోగు చేసి దహన సంస్కారాలు నిర్వహించారు. దేశెట్టి సిద్దరాములు, వెంకట్, గ్రామస్తులు శంకర్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్



(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. హవేలిఘనపూర్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ప్రకారం హవేలీ ఘనపూర్ గ్రామానికి చెందిన మూగ పవన్ కళ్యాణ్(24) గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మూగ లక్ష్మికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. గత రెండేళ్ల క్రితం లక్ష్మీ భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబ పోషణ మొత్తం పెద్ద కుమారుడు పవన్ కళ్యాణ్‌పై పడడంతో కూలీ పనులు చేసుకుంటూ పోషిస్తున్నాడు. పవన్ కళ్యాణ్ చెల్లెలు వివాహానికి డబ్బులు లేకపోవడంతో బాధపడుతుండేవాడు. మంగళవారం పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించగా అక్కడి డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

సమగ్ర సర్వేపై అపోహలు వద్దు

- అందరికీ పథకాలు అందించడానికి సర్వే
- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ-రామాయంపేట



ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేపై అపోహలు వద్దని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. బుధవారం ఆయన రామాయంపేటలో జరుగుతున్న సమగ్ర సర్వే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుటుంబ ఆర్థిక సర్వే విజయవంతంగా కొనసాగుతుందన్నారు. నేటి వరకు 30శాతంకు పైగా సర్వే పూర్తయినట్టుగా ఆయన తెలిపారు. వారం రోజుల్లో సర్వే పూర్తి చేస్తామన్నారు. ప్రజలు అపోహలకు పోకుండా సమగ్ర ఆర్థిక కుటుంబ సర్వేకు సహకరించాలని సూచించారు. ఇప్పటివరకు ఉన్న సంక్షేమ పథకాలు తీసేస్తామన్నది కేవలం అపోహ మాత్రమేనన్నారు. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే సర్వే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజినితో పాటు పలువురు పాల్గొన్నారు.

అద్దె భవనాన్ని పరిశీలించిన ఆర్‌డీఓ

నవతెలంగాణ-నిజాంపేట



మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న తహశీల్దార్ కార్యాలయం వర్షానికి ఊరుస్తున్నందున ఇబ్బంది ఏర్పడుతుందనే ఉద్దేశంతో నూతన భవనంలోకి తహశీల్దార్ కార్యాలయం మార్చాలనే ఉద్దేశంతో బుధవారం ఆర్డీఓ రమాదేవి నూతన భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన భవనాన్ని పరిశీలించామని, ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తామన్నారు. రైతుల వడ్లు కొనే నాధుడే కరువయ్యాడని దళారులు తక్కువ ధరకు రైతుల నుంచి వడ్లను కొనుగోలు చేస్తున్నారని, లారీలు రావడంలేదని రైతులు ఆర్‌డీఓ రమాదేవి ఎదుట వాపోయారు. లారీలను పంపించడం జరుగుతుందని వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్య పడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ యాదయ్య, తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీవో రాజిరెడ్డి, ఏపీవో ప్రవీణ్ కుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్‌లు ప్రీతి, సర్వేయర్ ప్రశాంత్, కంప్యూటర్ ఆపరేటర్ వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నరసింహులు, పంచాయతీ కార్యదర్శి అరిఫ్ హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు పంజా మహేందర్, నసీరుద్దీన్, రమావత్ వినోద్, కల్వకుంట మాజీ ఎంపీటీసీ చింతల స్వామి, వీఆర్ఏ బత్తుల శ్రీనివాస్, జీడి భూమా గౌడ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తుకు బానిసైన యువతను తల్లిదండ్రులే కాపాడుకోవాలి

- ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-తూప్రాన్



గంజాయి మత్తుకు బానిసలు అవుతున్న యువతను తల్లిదండ్రులే కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. తూప్రాన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. జిల్లాలో భారీ ఎత్తున గంజాయి రవాణా చేస్తున్న స్మగ్లర్ల ను పట్టుకుంటున్నామన్నారు. గత వారం రోజులుగా గంజా యిపై పోలీసులు ముమ్మర దాడులు చేస్తూ గంజాయికి బానిసైన యువకులను, గంజాయి స్మగ్లింగ్ చేస్తూ విక్రయి స్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నామన్నారు. 20 నుంచి 30 సంవత్సరాల వయస్సు ఉన్న యువకులే గంజా యి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వ్యసనాలకు బానిసవుతున్నారన్నారు. ఈ ప్రమాదం నుంచి యువత తల్లిదండ్రులే కాపాడుకోవాలని సూచించారు. తమ పిల్లలు గంజాయి మత్తులో ఇంటికి వస్తే తల్లిదండ్రులు ప్రశ్నించి, బుద్ధి చెప్పాల ని తెలిపారు. తమ పిల్లల ద్వారా గంజాయిని విక్రయిస్తున్న, కొనుగోలు చేస్తున్న వ్యక్తుల వివరాలు సేకరించి పోలీసులకు తెలపాలన్నారు. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు గంజాయి మత్తులో ఇంటికి వస్తున్నా ఇరుగు పొరుగు వారి ముందు తమ పరువు ఎక్కడ పోతుందోనని భయపడుతూ, గోప్యంగా ఉంచుతున్నా రన్నారు. తల్లిదండ్రులు కూడా సమాజంలో తమ బాధ్యతగా గంజాయి మహమ్మారిని అరికట్టడంలో ముందుకు రావాలని కోరారు. గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని భావి భార త సమాజాన్ని కాపాడుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు..ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ రంగకృష్ణ, ఎస్ఐ శివానందం, మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్, కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీలోని బ్రహ్మంగారి గుట్ట పై కాలజ్ఞాని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 416వ జయంతిని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గణపతి పూజ, కలశారాధన, వీరబ్రహ్మేంద్ర స్వామికి షోడష ఉపచారపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ దశాబ్దాలుగా బ్రహ్మంగారి గుట్ట వద్ద గజ్వేల్ ప్రాంత ప్రజలు స్వామివారిని ఆరాధిస్తున్నారని తెలిపారు. కలియుగంలో భవిష్యత్తులో సమాజ పరిస్థితులను, జరగబోయే సంఘటనలను కాలజ్ఞానం ద్వారా వివరించడంతోపాటు సమాజంలోని కులమత బేధాలను నిర్మూలించడంలో వీరబ్రహ్మేంద్రస్వామి ముఖ్య పాత్ర వహించారన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ పట్టణంతో పాటు, ఆర్అండ్ఆర్ కాలనీ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన



నవతెలంగాణ-నార్సింగి : జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక ఎస్ఐ అహ్మద్ మొహిఉద్దీన్ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, మహిళల పై దాడులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాలల పై దాడులు, వరకట్న వేధింపులు, ట్రాఫిక్ నిబంధనలు, తదితర విషయాలపై చైతన్యం కల్పించారు. త్రిబుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వాహనం నడపడం, రాంగ్ రూట్లో నడపడం వల్ల ప్రమాదానికి గురైతే ప్రమాద భీమా చేసుకుని ఉన్నా బీమా డబ్బులు రావు అని తెలిపారు. చట్టాలు ప్రజల రక్షణ, మేలు కొరకు చేశారని అధిగమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శంకర్, హెడ్ కానిస్టేబుల్ యాదగిరి, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మాట ఇచ్చి..విస్మరించిన ప్రభుత్వం



నవతెలంగాణ-ములుగు

ఆరు గ్యారెంటీలు అమలుచేసి తెలంగాణ ప్రజల తల రాతలు మారుస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దరం గురువా రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిన్నతిమ్మాపూర్‌లో బీజేపీ మండల శక్తికేంద్రాల బూత్ అధ్యక్షుల పునర్నిర్మాణం కార్యక్రమాన్ని మండల అధ్యక్షులు మన్నె శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురువా రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను మరిచి పేదలకు కన్నీరు మిగిల్చిందన్నారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలులో జాప్యం, వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి రైతన్నలకు సైతం మోసం చేసిందని ఆరోపించారు. ఇకనైనా ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి సారించి ఆదుకోవాలనీ గురువా రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహయోగి, జిల్లా కార్యదర్శి శశిధర్ రెడ్డి, నరేందర్ విజయ లక్ష్మి(మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు) కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కొండ నర్సింలు మండల, పుల్లబోయిన బాబు, మహేష్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రసవత్తరంగా జరగనున్న నస్కల్ సర్పంచ్ ఎన్నికలు

నవతెలంగాణ-నిజాంపేట



నస్కల్ గ్రామ సర్పంచి పోటీలో పలువురు ఆశావాహులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. నస్కల్ గ్రామ సర్పంచిగా పోయిన ఎన్నికలలో కరయ్య గెలవగా ఆయన కరోనా వచ్చి చనిపోయాడు. దీంతో నస్కల్ గ్రామం అనుకున్నంత అభివృద్ధి జరగలేదని తనను సర్పంచిగా గెలిపించినట్లయితే ఇంకా అభివృద్ధి చేస్తానని కరయ్య కుమారుడు నగేష్ తెలిపారు. గత ఎన్నికలలో ఎంపీటీసీగా గెలిచి మండల అధ్యక్ష పదవి చేపట్టి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఈసారి సర్పంచ్‌గా అవకాశం ఇస్తే ఇంకా అభివృద్ధి చేస్తానని మాజీ ఎంపీపీ దేసెట్టి సిద్దరాములు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ఎమ్మెల్యే చొరవతో ప్రత్యేక నిధులను తీసుకువచ్చి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని గ్రామానికి చెందిన లక్ష్మా గౌడ్ తెలిపారు. దేశెట్టి లింగం మాట్లాడుతూ గతంలో రామాయంపేట పిఏసిఎస్ చైర్మన్‌గా పనిచేసి నస్కల్ గ్రామస్తులకు అనేక మంది రైతులకు రుణాలు అందించడం జరిగిందని తనను సర్పంచ్‌గా గెలిపించినట్లయితే ప్రాథమిక సహకార పరపతిసంఘాన్ని పునరుద్ధరించడానికి కృషి చేస్తానని దేశెట్టి లింగం తెలిపారు. తీగల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గతంలో సర్పంచ్‌గా పోటీ చేసి ఓడిపోవడం జరిగిందని, ఆ సానుభూతి ప్రజలలో ఉందని ఈసారి తప్పకుండా సర్పంచ్‌గా గెలుపొందుతానన్నారు. బీజేపీ ఎంపీ రఘునందన్ రావు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఈసారి మాత్రం నస్కల్ సర్పంచి ఎన్నికలు రసవత్తరంగానే జరుగుతాయని గ్రామస్తులు ఉత్కంఠంతో ఎదురుచూస్తున్నారు .

రైతుల వడ్లు కొనమంటే ఢిల్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల డ్రామా

- కేంద్రమే అన్ని సౌకర్యాలు కల్పిస్తుంటే కమిషన్ కోసం కొట్లాట
- గతంలో కేసీఆర్ మల్లన్న సాగర్, నేడు రేవంత్ సొంత జిల్లాలో ఫార్మా భూముల లొల్లి
- మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు

నవతెలంగాణ-హవేలి ఘనపూర్




రాష్ట్ర ప్రభుత్వం వడ్లు కొనమంటే ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రతిపక్ష నేత కేటీఆర్‌లు డ్రామా ఆడుతున్నారని మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని తొగిట గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం నెల రోజులలో మూడు లారీలు కేంద్రానికి పంపడంతో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అవస్థలు పడుతుంటే కాంగ్రెస్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దొంగ నాటకాలు ఆడుతున్నారన్నారు. గతంలో కేసీఆర్ మల్లన్న సాగర్ ప్రాజెక్టు పేరుతో రైతులను అర్ధరాత్రి అరెస్టు చేసి జైలు పాలు చేశారని, నేడు సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ఫార్మా కంపెనీల పేరుతో రైతులను రాజకీయ పార్టీ రంగుతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తుంటే కమిషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం పోటీ పడుతుందన్నారు. చిన్న శంకరంపేట మండలం శాలిపేట గ్రామ సొసైటీ డైరెక్టర్లు దళాలను ప్రోత్సహిస్తూ సన్న వడ్లను ప్రైవేటు వ్యక్తులకు అమ్ముకోవాలని సూచించడం సిగ్గుచేట న్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ రైతులను ఇబ్బందులు లేకుండా లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలించాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ వరి ధాన్యం కొనుగోలు విషయంలో అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందా రెడ్డి, మెదక్ నియోజకవర్గం ఇంచార్జ్ పంజా విజయ్ కుమా ర్, జిల్లా ఉపాధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, మండల అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు శ్యాంసుందర్, మండల నాయకులు నవీన్, సాయిబాబా, వెంకట్, రాజ్ కుమార్, అశోక్, ప్రవీణ్, సురేష్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.



రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవం

నవతెలంగాణ-గజ్వేల్



కార్తీకమాసం మించిన మా సం మరొకటి లేదని, దీపారాధన ఈ మాసంలో చాలా శ్రేష్ఠమైనదని బుధవారం మహా శివునికి అభి ,షేకాలు నిర్వహించారు. అనంత రం పసుపు, కుంకుమతో భారీ శివలింగాన్ని అద్భుతంగా రూ పొందించి చుట్టూ దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాని కి శ్రీకారం చుట్టారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్తీక మాసంలో ఉపవాస వ్రతాలు, దీపాలు వెలిగించడం, బంధు, మిత్రులతో వనభోజనాలు చేయడం వల్ల జన్మజన్మలపాపాలు ప్రక్షాళన జరిగి అనంతమైన పుణ్య ఫలాలను ప్రసాదించే మహిమా న్వితమైన మాసం కార్తీకమాసం అన్నారు. మన భారతీయ సంస్కృతిలో కార్తీకమాసం వచ్చింది అంటే ఈ నెల రోజులు పండుగ పర్వదినాలే అన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎం అండ్ హెచ్ఓ

నవతెలంగాణ-నార్సింగి



మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ సందర్శించారు. ఆస్పత్రి రికార్డులను, వైద్యం కోసం వచ్చే అవుట్ పేషెంట్ రికార్డులను, ల్యాబ్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సిబ్బందితో ఆయన సమీక్ష సమావే శాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుప త్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగేలా సిబ్బంది చొరవ చూపాల న్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు చేసుకునేలా గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గర్భిణీలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాధలతో ఆసుప త్రికి వచ్చే రోగులకు ప్రేమతో ఉత్తమంగా సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య అదనపు అధికారి జ్ఞానేశ్వర్, నర్సాపూర్ డివిజన్ వైద్య ఆరోగ్య అదనపు అధికారి సృజన, మెదక్ డివిజన్ వైద్య ఆరోగ్య అదనపు అధికారి నవీన్, మండల వైద్య ఆరోగ్య అధికారి రేఖ, రవి కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలి

.నవతెలంగాణ-గజ్వేల్

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మద్దతు ధర ప్రకటించాలని గజ్వేల్ పట్టణ మండల అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ పంజాల అశోక్ గౌడ్, సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మర్కంటి ఏగొండ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు గజ్వేల్ పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో ధాన్యాన్ని పరిశీలించిన అనంతరం మార్కెట్ యార్డ్‌లో నిర్మించిన భూసార పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అధునాతన భూసార పరీక్ష కేంద్రాన్ని నిర్మించినప్పటికీ అది ఈరోజు వరకు వృధాగా ఉండిపోయిందని అన్నారు. గజ్వేల్ ప్రాంతంలో అత్యధికంగా 100కు పైగా ఫర్టిలైజర్స్ ఉన్నాయని అందులో ఏ ఒక్క ఫర్టిలైజర్ షాప్ లో కూడా ఆర్గానిక్ మందులు లేవని అన్నారు. భూసార పరీక్షలు నిర్వహించేందుకు డిసెంబర్ నెల, మే నెలలో మాత్రమే సాధ్యమవుతుందని కావున ప్రభుత్వం భూసార పరీక్షలు నిర్వహించి రైతులకు మేలు చేయాలని సూచించారు. వడ్ల కొనుగోలు వేగవంతం చేయాలని, సన్న వడ్లకు బోనస్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు పంజా బాలు, ఉప్పల మధుసూదన్ ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు పెంట్యాల శ్రీనివాస్, మైస విజయ్ నాయని సందీప్ బారు అరవింద్ గజ్వేల్ మండల ఉపాధ్యక్షులు బార్ అరవింద్, పంజాల వెంకట్ గౌడ్, దువ్వల రాజు నవీన్ కుమార్, తదితరులు, రైతులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సిద్దిపేట
గురువారం | 14 నవంబర్ 2024 | www.navatelangana.com

బెక్కల్ నుండి కూటిగలకు బీటీ రోడ్డు నిర్మించాలి



నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బెక్కల్ నుంచి కూటిగల్ గ్రామానికి వెంటనే ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మించాలని. సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కూటిగల్ గ్రామంలో ఆ పార్టీ 5వ మహాసభను శ్రీరాముల కనకయ్య, అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ కూటిగల్ గ్రామ ప్రజలు దూల్మిట్ట మండల కేంద్రానికి వెళ్లాలంటే కొండాపూర్, బెక్కల్, తోర్నాల, గ్రామాల మీదుగా 15 కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తుందని తెలిపారు. కూటిగల్ నుంచి బెక్కల్, గుట్ట వరకు మట్టి రోడ్డు ఉందని ప్రభుత్వం వెంటనే ఆ మట్టి రోడ్డును బీటీ రోడ్డుగా వేయాలని డిమాండ్ చేశారు. అలాగే దూల్మిట్ట మండలంలోని అన్ని రహదారులన్నీ గుంతల మయంగా మారాయని వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. కూటిగల్ శాఖ కార్యదర్శిగా శ్రీరాముల కనకయ్య ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్, శ్రీరాముల వెంకటేశం, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

కదలిన అన్నపూర్ణ జలాశయ అధికార యంత్రాంగం

- డీ7 సాగు కాల్వపై అధికారుల కొలతలు
- యథావిధిగా కట్ట మట్టి సరిచేయాలని అదేశాలు



నవతెలంగాణ-బెజ్జంకి

స్పందన

'సాగు కాల్వ ఆక్రమణ' శీర్షికతో సాగు కాల్వ మట్టి తొలగించి చదును చేసంటూ నవతెలంగాణ దినపత్రిక నవంబర్ 11న కథనాన్ని ప్రచురించింది. కథనానికి స్పందించిన అన్నపూర్ణ జలాశయం అధికార యంత్రాంగం డీఈఈ దేవేందర్, ఏఈ నాగేశ్వర్ రావు మంగళవారం డీ7 సాగు కాల్వ విస్తీర్ణం కొలతలు నిర్వహించారు. ఎలాంటి అను మతుల్లేకుండా తొలగించిన సాగు కాల్వ పటిష్ఠతకు కట్ట మట్టిని యథావిధిగా సరిచేయాలని అదేశాలిచ్చినట్టు డీఈఈ దేవేందర్ తెలిపారు. సాగు కాల్వ మట్టి అక్రమంగా తొలగించిన తీరుపై స్పందించిన అధికారులకు పరిసర ప్రాంతాల రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సీసీ కెమెరాలతో భద్రత

- ఏసీపీ పురుషోత్తం రెడ్డి



నవతెలంగాణ-కొండపాక

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుతో భద్రత ఏర్పడుతుందని గజ్వేల్ ఏసీపీ పురుషోత్తం రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలో ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు తెలిపారు. సీసీ కెమెరాలతో అపరిచిత వ్యక్తులను గుర్తించవచ్చని పెడుతున్నారు. ఈ కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్, కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-నంగునూరు

గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట ఏడీఏ పద్మ సూచించారు. బుధవారం మండలంలోని గట్లమ ల్యాల గ్రామంలో ఐకేపీ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ గీత, ఏఈఓ కవిత, ఐకేపీ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం చార్జీలు పెంచాలి



నవతెలంగాణ-సిద్దిపేట

మిడ్డే మిల్స్ చార్జీలు పెంచాలని ఎంఈఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించినట్లు ఎస్ఎఫ్ఐ సిద్దిపేట పట్టణ కార్యదర్శి బత్తుల అభిషేక్ భాను తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల రాష్ట్రంలో మధ్యాహ్న భోజనానికి మెస్ ఛార్జీలు పెంచినట్లుగా పాఠశాలలకు పెరిగిన ధరలకు అనుగుణంగా మిడ్డే మిల్స్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. గత ఎనిమిదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని మండిపడ్డారు. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు బకాయిలు తక్షణమే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన సిద్దిపేట పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, అరుణ్ కుమార్, నవదీపు, హర్షవర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే సమగ్రవంతంగా నిర్వహించాలి

- జిల్లా పరిషత్ సీఈవో రమేష్



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

గ్రామాల్లో నిర్వహించే కులగణన సర్వే సమగ్రవంతంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో రమేష్ అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామంలో సర్వే పనితీరును పరిశీలించారు. సర్వేలో ప్రజల యొక్క వివరాలను పూర్తిస్థాయిలో సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య అధికారులు పాల్గొన్నారు.


ముందస్తుగా బాలల దినోత్సవం వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట

శ్రీవాణి స్కూల్లో (భారత్ నగర్) ముందస్తుగా బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా బుధవారం జరిగాయి. విద్యార్థులు వేసిన నెహ్రూ, భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి వివిధ వేషధారునలు ఆకట్టుకున్నాయి. సుమారు 160 మంది విద్యార్థిని, విద్యార్థులచే నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సిహెచ్. సత్యం మాట్లాడుతూ గత 13 ఏండ్ల నుంచి పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా చేసుకుంటామని, దేశానికి మొదటి ప్రధానమంత్రి అయిన జవహర్ లాల్ నెహ్రూ జన్మదిన వేడుకలను బాలల దినోత్సవంగా చేసుకుంటామని, సాంస్కృత కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఎంత ఎత్తుకెదిగిన మన చిన్ననాటి జ్ఞాపకాలను మనము మరువలేమని, మంచి అలవాట్లు చిన్నతనం నుంచి అలవర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


నేషనల్ అచీవ్‌మెంట్ పరీక్షకు సంసిద్ధులను చేయాలి



నవతెలంగాణ-కొండపాక

డిసెంబర్ నెలలో నిర్వహించే నేషనల్ అచీవ్ మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని కుకునూరుపల్లి మండల ఎంఈఓ బి.సత్తయ్య ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని మాత్ పల్లి, హనుమాన నగర్ కుకునూరుపల్లి ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్ష కోసం విద్యార్థులను ఏ విధంగా ప్రిపేర్ చేస్తున్నారని విషయాన్ని తెలుసుకున్నారు. విద్యార్థులకు నిర్వహించిన నమూనా పరీక్ష పేపర్లను పరిశీలించారు. ఇప్పటివరకు మూడు ప్రాక్టీస్ టెస్టులు జరిగాయని డిసెంబర్‌లో ప్రధాన పరీక్ష జరుగుతుందన్నారు. 3వ, 6వ, 9వ తరగతుల విద్యార్థులకు ప్రతిరోజు ఆయా అంశాల్లో అవగాహన కల్పించి పరీక్షకు సంసిద్ధులను చేయాలన్నారు. ఈ పరీక్ష ప్రతి మూడు ఏండ్లకు ఒకసారి ఎన్‌సీఈఆర్‌టీ నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఆయ పాఠశాలల ప్రధానోపా ధ్యాయులు ఉపాధ్యాయులు సీఆర్‌పీ సంతోష్ ఉన్నారు.

ఆర్బిటల్‌పై విద్యార్థులకు అవగాహన



నవతెలంగాణ-సిద్దిపేట

ఎస్, పీ, డీ ఆర్బిటాల్లాను పదో తరగతి విద్యార్థులు రంగులవల్లులతో వివిధ రూపాల్లో గీసి ఆకట్టుకున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంజలి, సైన్సు ఉపాధ్యాయులు మల్లు గారి ఇంద్రసేనారెడ్డిలు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ పూజ, రక్షితలు రెండు గ్రూపులుగా విడిపోయి తాము పాఠ్య పుస్తకాల్లో చదువుతున్న సైన్స్ పాఠాలను ముగ్గులతో వివిధ ఆకృతులను గీసి వారి నైపుణ్యాన్ని ఆలోచనలను, ప్రదర్శించారని తెలిపారు. నూతన పద్ధతుల ద్వారా చదువుకుంటే విద్యార్థులకు బాగా అర్థమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్రెడ్డి, ప్రభావతి, సునంద, రాజయ్య పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యతోనే మంచి ఫలితాలు

- డీఈఓ శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా మంచి ఫలితాలు సాధించగలుగుతామని జిల్లా విద్యాధికారి ఈ శ్రీనివాస్ రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. పట్టణంలోని లయన్స్ భవనంలో టెక్ మహీంద్రా సహాయతా ఫౌండేషన్, సైన్స్ అకాడమీ, సిద్దిపేట జిల్లా సమగ్ర శిక్ష సమన్వయంతో సైన్స్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈసారి నిజాయితీపరమైన పదో తరగతి ఫలితాలను ఆశిస్తున్నాని అన్నారు. అనంతరం పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ సర్టిఫికెట్లు , సైన్స్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త భాస్కర్, సైన్స్ అకాడమీ సభ్యులు రేవతి, అమీర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు జోజి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటర్ చైతన్య యాత్రలతో పెరుగుతున్న కొత్త ఓటర్లు

- కొత్త ఓటర్లు 16 వేలకు పైగా చేరింది



నవతెలంగాణ-గజ్వేల్

జిల్లాలో ఓటర్ చైతన్యం చేయడంలో యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఎలక్షన్ కమిషన్ అవకాశం ఇచ్చినప్పుడల్లా కొత్త ఓటర్లు నమోదు చేసుకుంటున్నారు. ఉద్యోగరీత్యా, కూలి నాలి రీత్యా ప్రాంతాలు మారిన వారు వారి చోట్ల ఓటర్లను నమోదు చేసుకుంటున్నారు. దీనికి కారణం అధికారుల ఓటర్ల చైతన్య కార్యక్రమాలు ఉపయోగపడుతున్నాయి. సిద్దిపేట జిల్లాలో గత నెలలో ఓటింగ్ కోసం దరఖాస్తు పెట్టుకున్న వారిని పరిశీలిస్తే 16,415 మంది ఓటు నమోదు చేసుకున్నారు. కొత్త ఓటర్లుగా నమోదైనట్లు అధికారులు చెప్తున్నారు. అదేవిధంగా బీఎల్ఓ ల ద్వారా క్షేత్రస్థాయిలో ఓటర్ జాబితా ప్రకారం పరిశీలిస్తే 4,733(పురుషులు, మహిళలు-2,504 . మరణించినవారు-1.560, జిల్లా నుంచి వెళ్లిపోయిన వారు-1,763, డబుల్ ఓటర్లు-1,406) మంది ఓటర్లను తొలగించారు. ఎస్ఎస్ఆర్‌లో భాగంగా 2025 జనవరి నాటికి 18 ఏండ్లు నిండిన వారంతా కొత్తగా ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవచ్చని ప్రచారం నిర్వహించారు. వీరితోపాటు ఓట్లల్లో జాబితాలో పేరు లేని 18 ఏళ్లు వెళ్లిన వారు కూడా నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇది ఎంతోమంది సద్వినియోగం చేసుకుంటున్నారు. ఓటర్ నమోదుకు ఫారం-6, జాబితాలో అభ్యంతరాల ఫారం-7, సవరణ కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మూసాయిధ జాబితాలో తమ ఓటు సక్రమంగా ఉందా లేదా పరిశీలించుకోవచ్చు అని, మార్పులు చేర్పులుంటే నవంబర్ 28 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం సూచించింది. డిసెంబర్ 24న పరిష్కారం చేస్తామని అధికారులు అంటున్నారు. ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ను నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

లోకల్ బాడీ ఎన్నికల్లో..

గ్రామపంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగిన ఉన్నది. బరిలో నిలిచి అభ్యర్థుల సైతం ఓట్లను నమోదుకు కృషి చేయనున్నారు. పట్టణాన్ని కాకుండా గ్రామీణ ప్రాంతంలో ఓటు హక్కు పొందే అవకాశం ఉంది. పోటీ చేసే అభ్యర్థులు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నారు.

సిద్దిపేట జిల్లాలో

గజ్వేల్ నియోజకవర్గంలో మొత్తం 2,83,689 (పురుషులు-1,39,406. మహిళలు-1,44,277. ఇతరులు-06) మంది ఓటర్లు ఉన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,00,729 (పురుషులు-97,377. మహిళలు-1,03,352) మంది ఉన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,39,174 (పురుషులు-1,17,151. మహిళలు-1,121,952. ఇతరులు-71)ఉన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,49,439 (పురుషులు-1,22,445. మహిళలు-1,26,988) ఉన్నారు.

యువత ముందుకు రావాలి



ఓటర్ నమోదుకు యువత ముందుకు రావాలి. ఓటర్ నమోదు కాని వారికి ఓటు నమోదు చేయించాలి. ఓటు రాజ్యాంగ హక్కు. ఓటుతో అభివృద్ధి సాధించుకోవచ్చు. ప్రతి ఒక్కరూ ఓటును నమోదు చేసుకుని ఎన్నికలు వచ్చినాటికి ఓటును సద్వినియోగం చేసుకోవాలి.

-జాతీయ యువజన సంఘాల ప్రధాన కార్యదర్శి దేశ బోయిన నర్సింలు

అమరవీరుల స్ఫూర్తితో పోరాడుదాం

- పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్



నవతెలంగాణ-చేర్యాల

విద్యారంగ సమస్యలపై అమరవీరుల స్ఫూర్తితో పోరాడుదామని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థి ఉద్యమంలో అసువులు బాసిన విద్యార్థి అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా చేర్యాల మండల కేంద్రంలోని గౌతమి జూనియర్ కళాశాలలో బుధవారం సంస్మరణ సభన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ దోపిడీ పీడనలేని సమ సమాజం కోసం తపించి అనేకమంది విప్లవ వీర కిశోరాలు తమ విలువైన ప్రాణాలను అర్పించారని అన్నారు. పీడీఎస్‌యూ పది దశాబ్దాల కాలంగా శాస్త్రీయ విద్యాసాధన, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులను చదువులకు దూరం చేసే విధానాలను అవలంభిస్తుందని దానిలో భాగంగానే స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయడం లేదని ఆరోపించారు. విద్యార్థి ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ముగింపు సభను ఈ నెల 16న దుబ్బాక డివిజన్ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సంపత్ కుమార్ ,అనిల్, అంజి, రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

అర్థాంతరం..ప్రమాదకరం

- కంకర తేలి ప్రమాదకరంగా బేగంపేట రోడ్డు
- భయం గుప్పిట్లో వాహనదారుల ప్రయాణం



నవతెలంగాణ-బెజ్జంకి

రోడ్డు నిర్మాణ పనులో ఆర్థాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు మండల కేంద్రం నుంచి బేగంపేట రోడ్డుకు మధ్య వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టి వదిలేసింది. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే శ్రద్ధ చూపి గుత్తేదారుతో మాట్లాడి నిలిచిన రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సంబంధిత గుత్తేదారు రోడ్డు నిర్మాణంలో కంకరవేసి వదిలేశారు. గత కొద్ది నెలలుగా నిర్మాణ పనులు నిలిచిపోవడంతో కంకర తేలి వాహనదారుల ప్రయాణానికి ప్రమాదకరంగా మారింది. కంకర తేలిన రోడ్డుపై వాహనదారులు, ప్రజలు భయం గుప్పిట్లో ప్రయాణం చేస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేల కృషి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

బీటీ నిర్మాణం చేపట్టేల అదేశాలు

సంబంధిత గుత్తేదారు బీటీ నిర్మాణం చేపట్టానికి సమయం తీసుకుంటున్నారు. త్వరితగతిన రోడ్డుపై బీటీ నిర్మాణం చేపట్టేల అదేశాలు ఇస్తాం.

-సాజీద్, ఆర్అండ్‌బీ ఏఈ.

సాగు కాల్వను ఆక్రమించి..ఎన్ఓసీకి దరఖాస్తు

- ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం నిర్వాహకం
- యువకుడి ఫిర్యాదుతో అలస్యంగా వెలుగులోకి
- ఆక్రమణకు గురైన కాల్వను సందర్శించిన ఎస్ఆర్ఎస్పీ డీఈ
- నివేదికను పై అధికారులకు అందజేస్తానని డీఈ అంజయ్య వెల్లడి





నవతెలంగాణ-బెజ్జంకి

కోహెడ మండలం శనిగరం గ్రామ శివారులోని జలాశయం నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లోని పంటలకు సాగు నీరందించడానికి కాలువలు నిర్మించారు. శనిగరం జలాశయం నుంచి గుగ్గిల్ల గ్రామ శివారులోని సర్వే నంబర్ 557, 559, 561, 290, 291 భూముల ద్వారా ప్రవహించి గాగీలపూర్ గ్రామ రైతుల పంటలకు నీరందించే సాగు నీటి కాల్వను గ్రీన్ ఫీల్డ్ బయోనర్జీ ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం అక్రమించి నిర్మాణం చేపడుతున్నారని సంబంధిత అధికారులకు యువకుడు ఫిర్యాదు చేశాడు. యువకుడి ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్ఆర్ఎస్పీ డీఈ అంజయ్య ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం అక్రమణకు గురైన సాగు కాల్వ భూములను సందర్శించి పరిశీలించారు. సాగు కాల్వ భూములను ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం అక్రమించింది నిజమేనని నివేదికను సంబంధిత పై అధికారులకు అందజేస్తానని డీఈ అంజయ్య తెలిపారు. సాగు కాల్వను ఆక్రమించి ఇథనాల్ పరిశ్రమ యాజమాన్యం ఎన్ఓసీకి దరఖాస్తు చేయడం కొస మురుపు.

పోలీస్‌కళా బృందం ఆధ్వర్యంలో కనువిప్పు



నవతెలంగాణ-చిన్నకోదూరు

లేని పోని అనుమానాలతో కక్ష్యలు పెంచుకొని దురుసుగా ప్రవర్తిస్తూ, దాడులకు పాల్పడి ప్రాణాల మీదికి తెచ్చుకుని పోలీస్ కేసుల్లో ఇరుక్కుని జీవితాలు నాశనం చేసుకోవద్దని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను అన్నారు. మూఢ నమ్మకాలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వాడకంపై పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో చిన్నకోదూరు మండలం గంగాపూర్ గ్రామంలో నాటకం, పాటలు, ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను, చిన్నకోదూరు ఎస్ఐ బాలకృష్ణ మాట్లాడుతూ లేనిపోని అనుమానాలతో మంత్రాలు తంత్రాలు అంటూ కక్షలు కారుణ్యాలు పెంచుకొని కుటుంబాలను ఆర్థికంగా మానసికంగా కృంగదీసుకోవద్దనీ, ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే డాక్టర్లకు చూపించుకుని చికిత్స చేయించుకోవాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే కుల పెద్దలతో, గ్రామ పెద్దలతో కూర్చొని మాట్లాడుకోవాలని, లేదంటే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చిన అందరిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. స్కూల్, కాలేజీకి వెళ్లే పిల్లల ప్రవర్తనను గమనించవలసిన బాధ్యత తల్లిదండ్రులదేననీ తెలిపారు. అవసరం మేరకే సెల్ ఫోన్ వాడాలి. గంజాయి ఇతర మత్తు పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. మూఢనమ్మకాలు, రోడ్డు ప్రమాదాలు, గంజాయి ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, సామాజిక రుక్మతల గురించి సిద్దిపేట పోలీస్ కళాబృందం సభ్యులు బాలు, రాజు, తిరుమల, తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం సభ్యులు రాజేష్, భాస్కర్, యాదగిరి, నర్సింలు, బాబు, మంజుల, రాజమణి, వెంకటేష్ నాటకం, పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు.

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం కొరకు సమీక్ష

- ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్॥ ఆనంద్, అరుణ్ కుమార్





నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా మెడికల్ హెల్త్ ఆఫీస్ ఆవరణలో బుధవారం ఆరోగ్య కేంద్రాల సందర్శన అనంతరం జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్య అధికారులకు ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపైన ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్॥ ఆనంద్, అరుణ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ అన్ని ఆరోగ్య కేంద్రంలో కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ప్రజలకు అందించాలని, అన్ని ఆరోగ్య కార్యక్రమాల పనితీరును మెరుగుపరచుకోవాలని, వైద్యులు ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, ప్రోగ్రాం ఆఫీసర్లు ఆరోగ్య కేంద్రాలను సందర్శించి, రికార్డులను పరిశీలించాలని, ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపైన, ఆరోగ్య కేంద్రాల్లో సమీక్షలు నిర్వహించాలని, ఆరోగ్య కేంద్రాల్లో ఐపీ/ఓపీ/ సంఖ్యను పెంచాలన్నారు. 30ఏండ్ల వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి టీహబ్‌కు రక్త నమూనాలను పంపించాలని, హబ్ కార్డు ఎంట్రీస్ సంఖ్య పెంచాలని, తల్లి బిడ్డల ఆరోగ్య కార్యక్రమాల పైన ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ద్వారా అందించే వ్యాక్సిన్‌లను 100శాతం పిల్లలకు అందే విధంగా చూడాలని, సమయపాలన పాటించాలని పాటించని వారి పైన చర్యలు ఉంటాయని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆనంద్, అరుణ్ కుమార్, నారాయణ రావు, డిప్యూటీ డీఎంహెచ్వో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శ్రీకాంత్ యాదవ ప్రాజెక్ట్ ఆఫీసర్ వైద్య అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- మున్సిపల్ ఏడో వార్డు కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టాలని మున్సిపల్ పరిధిలోని ఏడో వార్డు కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరు చేసిన నిధులను తిరిగి మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తన వార్డులో సమస్యలు ఉన్నాయని వెంటనే పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ నిధులతో వార్డు అభివృద్ధి చేశామని మరింత అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని తెలిపారు. కేసీఆర్, హరీశ్‌రావు నాయకత్వంలో అన్ని రంగాల్లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధి చెందిందని, పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని కోరారు. అంతేకాకుండా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తే ఏడో వార్డులో అనేకమంది పేదలకు న్యాయం జరుగుతుందని ఆర్థికంగా సామాజికంగా ఉపయోగపడుతుందన్నారు. స్థానిక కాంగ్రెస్ నాయకత్వం దృష్టి పెట్టాలన్నారు. వార్డులో సీసీ రోడ్లు, మురికి కాలువ నిర్మాణం కొంతవరకు జరిగిందని మరికొంత అభివృద్ధి జరిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ఏడాదికి వస్తున్న పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలను పేదలకు అందించామని ఇందులో తమ వార్డులు అనేకమంది పేదలకు న్యాయం జరిగిందని గుర్తు చేశారు. కేసీఆర్ పథకాలు రద్దు చేయడం వల్ల పేదలకు న్యాయం జరగటం లేదన్నారు. కేసీఆర్ పథకాలను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ కిట్టు గర్భిణీ స్త్రీలకు ఎంతో నయం చేసిందన్నారు. అందులో పుట్టిన పిల్లలకు కావలసిన అన్ని వస్తువులు ఉండటం గ్రామీణ ప్రాంతంలో కేసీఆర్ కిట్టుకు మంచి పేరు వచ్చింది అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి అయినా మహిళలకు రూ .12 వేల అందించినట్లు గుర్తు చేశారు. అంతేకాకుండా రంజాన్, బతుకమ్మ పండుగ కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందన్నారు. వాటిని మళ్లీ కొనసాగించాలని కోరారు. రైతులకు రుణమాఫీ పూర్తి స్థాయిలో చేయలేదని చెప్పారు. ఎస్సీ ఎస్టీ మైనార్టీ లకు కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అందించి ముందుకుసాగినట్లు గుర్తు చేశారు. వచ్చే ప్రభుత్వం తమదేనని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. ఏడో వార్డు అభివృద్ధికి అవసరమైన కృషి చేసినట్లు అన్నారు.

మహిళలను గొప్ప వ్యాపారవేత్తలుగా చేయడమే లక్ష్యం





నవతెలంగాణ-నంగునూరు

మహిళలను బెస్ట్ ఎంటర్ ప్రైజెస్ లుగా, గొప్ప వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకం ముఖ్య ఉద్దేశమని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసుదేవ్ అన్నారు. నంగునూరు మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో ఆ పథకం ద్వారా లబ్ధి పొందిన లబ్దిదారులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా పీఎం, ఎఫ్ఎం పథకం యొక్క విధివిధానాలను, పథకం పొందేందుకు అర్హతలను లబ్దిదారు లకు క్షుణ్ణంగా వివరించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం, ఎఫ్ ఎంఈ పథకం ద్వారా అనేక రకాల యాక్టివేషన్స్ చేసుకో వచ్చునని, వ్యక్తిగత రుణాలతో పాటు గ్రూప్ రుణాలను పొంది ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చు నని చెప్పారు. ఈ పథకం ద్వారా గరిష్టంగా రూ.50 లక్షల వరకు వ్యక్తిగత రుణం పొందవచ్చునని, అలాగే ఇద్దరు లేదా అంతకన్నా ఎక్కువ సభ్యులతో ఏర్పడిన గ్రూప్‌కు రూ.10 కోట్ల వరకు రుణాలను పొందవచ్చునని తెలిపారు. 35 శాతం సబ్సిడీతో వ్యక్తిగతంగా పొందిన రుణానికి గరిష్టంగా రూ.10 లక్షల వరకు, అలాగే గ్రూప్ వారిగా పొందిన రుణానికి గరిష్టంగా రూ.3 కోట్ల వరకు సబ్సిడీ వర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా నంగునూరు మండలంలో వివిధ రకాల ఎంటర్ ప్రైజెస్‌ల ఏర్పాటు కోసమై 18 మంది లబ్ధి పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం, మహిపాల్, ఇంచార్జి ఎంపీడీఓ ప్రభాకర్ రావు, లబ్దిదారులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి పంటపై రైతులకు అవగాహన





నవతెలంగాణ-కొండపాక

అధిక సాంద్రత పత్తి సాగు ద్వారా పంట తొందరగా రావడంతో పాటు దిగుబడి కూడా పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కుకునూరు పల్లి గ్రామంలో బుధవారం అధిక సాంద్రత పత్తి సాగు పై రైతులకు వ్యవసాయ శాఖ కృషి విజ్ఞాన కేంద్రం తునికి శాస్త్రజ్ఞులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. అధిక సాంద్రత పత్తి సాగుతో పంటకాలం రెండు నెలలు పూర్తిగా ముందుకు వస్తుందని తెలిపారు. యంత్రం ద్వారా పత్తిని సేకరించుట సులువుగా ఉంటుందన్నారు. కుకునూర్ పల్లిలో రైతులు సాగు చేస్తున్న పంట పొలాన్ని గత ఆగస్టు మాసంలో కూడా సందర్శించామని తెలిపారు. ఈ అధిక సాంద్రత పత్తి ఎర్ర నేలలు, మధ్యస్థ నేలల్లో సాగు చేసినట్టయితే యసంగిలో కూడా రెండో పంట వేసుకోవడానికి అనువుగా ఉంటుందని తెలిపారు. అలాగే దిగుబడి కూడా సాధారణం కంటే అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రవికుమార్, ఉదయ్ కుమార్, ప్రతాపరెడ్డి, కుకునూరు పల్లి మండల వ్యవసాధికారి గోవిందరాజులు, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

- కార్పొరేటుకు ధీటుగా విద్యాభ్యాసం



నవతెలంగాణ-జగదేవపూర్

ప్రభుత్వ జూనియర్ కళాశాల జగదేవపూర్‌లో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బానోతు రాజన్న మాట్లాడుతూ మన కళాశాలలో కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా విద్యనందిస్తున్నామని ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ప్రత్యేక తరగతులు స్టడీ అవర్స్ వీకర్ విద్యార్థులకు స్పెషల్ క్లాసెస్ ఎంసెట్ క్లాసెస్ నిర్వహిస్తున్నామని, అదేవిధంగా కేర్ టేకర్ సిస్టం ద్వారా ప్రతి 20 మంది స్టూడెంట్స్ ఒక అధ్యాపకుడిని కేర్‌గా నియమించి వారి యొక్క భాగోగులన్నీ చూసుకోవడం జరుగుతుందని తల్లిదండ్రులకు తెలియజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులుగా మీరు కూడా వారి విషయంలో శ్రద్ధ తీసుకోవాలని ప్రస్తుతం సమాజంలో అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని ఇంటర్మీడియట్ వయస్సు అనేది ఒడిదొడుకుల వయస్సు కావున మత్తు పదార్థాలు డ్రగ్స్ లాంటి వాటికి ఎడిట్ అయ్యే ప్రమాదం ఉందని ఎన్నో ఆకర్షణలకు గురయ్యే అవకాశాలున్నాయని వీటన్నింటి నుంచి పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులుగా మీ దేనని తెలిపారు. ప్రత్యేకంగా వార్షిక పరీక్షలు వచ్చాయి కావున ఈ మూడు నెలలు విద్యార్థులను తల్లిదండ్రులు దగ్గరుండి చదివించాలని వారికి మంచి పౌష్టికాహారం అందించాలని అనేక విషయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేశారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపక అధ్యాపేకేతర బృంధం అందరూ పాల్గొనడం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

- తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్ రావు



నవతెలంగాణ-తొగుట

నేరాలను నిరోధించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగ పడతాయని తొగుట సీఐ లతీఫ్, ఎస్ఐ రవికాంత్ రావు అన్నా రు. బుధవారం తొగుట పోలీస్ స్టేషన్ పరిధిలో గల తుక్కాపూర్ గ్రామంలో కేఎస్ఆర్ కన్స్ట్రాక్షన్ ప్రయివేట్ లిమిటెడ్ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు అందరు ప్రతి గ్రామంలో సిసి కెమెరా లు ఏర్పాటు చేయాలని కోరారు. తమవంతుగా కృషి చేసి సహకారం అందించి సీసీ కెమెరాలు ఏర్పాటుకు ముందుకు రావాలని అన్నారు. సీసీ కెమెరాలు ల వల్ల నేరాలు జరగకుండా నిరోధించవచ్చు, అలాగే ఏవైనా నేరాలు జరిగినప్పుడు వాటిని చెందించడంలో ఉపయోగపడ్తాయనీ అన్నారు. వ్యక్తులు అసాంఘిక కార్యక్రమాలు చేయకుండా ఈవ్-టీజింగ్ లాంటివి జరగకుండా ఉంటాయని తెలిపారు. తుక్కాపూర్ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన కేఎస్ఆర్ కన్స ట్రాక్షన్ ప్రయివేట్ లిమిటెడ్ పీఎం కొండల్ రెడ్డి ని సన్మానించినారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి



నవతెలంగాణ-సిద్దిపేట

కుల గణన సర్వేలో ఎన్యూమరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల పై ఒత్తిడి తగ్గించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు తిరుపతి రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయందర్ రెడ్డి, నరేందర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఏవో కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే మధ్యాహ్నం 01 గంటలకు నిర్వహించడం వలన గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది వ్యవసాయ పనులకు వెళ్లడం వలన సర్వే చేయడం చాలా ఇబ్బందిగా మారిందని, ప్రతి ఎన్యూమరేటర్‌కు 75 కుటుంబాలు కేటాయించి, ఉపాధ్యాయుల ఒత్తిడి తగ్గించాలని కోరారు. సర్వే ఉదయం పూట నిర్వహించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొనమళ్ళ రాములు, రాష్ట్ర కౌన్సిలర్లు రాజులు, జానకి రాములు, దామెర రాజయ్య, జిల్లా కార్యదర్శులు రాంరెడ్డి, మంజుల, సత్యక్రిష్ణ, శ్రీనివాస్, రాములు, సీనియర్ నాయకులు మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

లోహిత్ సాయి ఆస్పత్రిలో అరుదైన చికిత్స



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణంలోని లోహిత్ సాయి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేసి, ఒక మహిళ కడుపులో నుంచి 9.5 కిలోల గడ్డా తొలగించినట్లు ఆస్పత్రి చైర్మెన్, వైద్యులు ఏ.భాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ చేర్యాల గ్రామానికి చెందికి మహిళ కడుపు నొప్పి రావడంతో పాటు, కడుపు ఉబ్బుతుందని గత 4 రోజుల క్రితం ఆసుపత్రికి రాగా, ఆమెకు స్కాన్ చేయగా కడుపులో గడ్డ ఉందని రిపోర్టులో వచ్చిందన్నారు. మంగళవారం రాత్రి ఎక్స్ ప్లోరటోరీ లాపరోటోమీ సర్జరీ చేసి ఈ గడ్డను తొలగించడం జరిగిందన్నారు. ఈ సర్జరీలో వైద్యులు దేవేందర్, శ్రీయ, వెంకట్, టెక్నీషియన్లు స్వామి, సురేష్ , సైదులు, సుశీల ఆయమ్మ, సిస్టర్స్ శ్రావణి, అంజలిలు ఉన్నారు.

నింధితులకు జైలు శిక్ష

నవతెలంగాణ-కొండపాక

రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నింధితులకు మూడేండ్ల జైలు శిక్ష విధిస్తూ అదనపు ప్రధమ శ్రేణి న్యాయమూర్తి ప్రియాంక తీర్పు ఇచ్చినట్లు కుకునూరు పల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కుకునూరు పల్లి పోలీస్ పరిధిలో గత ఎనిమిది నెలల క్రితం కొండపాక, తిమ్మారెడ్డిపల్లి కొడకండ్ల, కుకునూరు పల్లి గ్రామాల్లో రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి దొంగతనాలకు పాల్పడిన రాథోడ్ ఏ జాదవ్ నగేష్ , జాదవ్ బలరాం వీరి నివాసం వాసర గ్రామం చందర్ నాయక్ తండా సిర్గాపూర్ మండల్ సంగారెడ్డి జిల్లా. వీరిని సాంకేతికతతో గుర్తించి కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చెంచల్ చెర్వుపల్లిలో గంజాయి పట్టివేత



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని చెంచల్‌చెర్వుపల్లి గ్రామంలో 830 గ్రాముల గంజాయిని మంగళవారం హుస్నాబాద్ ఎక్సైజ్ ఎస్సై రూప ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు చెంచల్‌చెర్వుపల్లి గ్రామంలో నిర్వహించిన దాడుల్లో నారోజు గణేష్‌చారి అనే వ్యక్తి వద్ద గంజాయిని స్వాధీనం చేసినట్లు తెలిపారు. అలాగే కేసు నమోదు చేసి మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు జైలుకు తరలించినట్లు హుస్నాబాద్ ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపారు. గుడుంబా, గంజాయి, ఇతర నిషేధిత మత్తుపదార్థాలు సరఫరా చెసిన, అమ్మినా చట్టరీత్య చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

ఎంపీ ఆదేశంతో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-తొగుట

మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆదేశానుసారం మృతుని కుటుంబానకి ఆర్థిక సాయం అందించామని తుక్కాపూర్ మాజీ సర్పంచ్ చిక్కుడు చంద్రం ముదిరాజ్ తెలిపారు. బుధవారం గత ఆరు నెలల క్రితం తుక్కాపూర్ గ్రామానికి చెందిన బోయిన్ కిషన్ లింగాపూర్ గ్రామంలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ పనులు చేస్తుండగా విద్యుత్ షాట్ సర్క్యూట్ వల్ల గాయాల పాలయ్యాడు. నాటి నుంచి ఇప్పటి వరకు అనేక ఇబ్బంది పడుతు మృతి చెందాడు. మృతుని కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నందున వారికి ఆర్థిక సాయం అందించాలని ఎంపీ అదేశించడంతో దహన సంస్కారాల ఖర్చు కోసం రూ. 17,500 అందించా మన్నారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మస్యారి నర్సింలు కుటుంబానికి



మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన మస్యారి నర్సింలు గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకొన్న ఈ స్థానిక మాజీ సర్పంచ్ చిక్కుడు చంద్రం మృతుని కుటుంబ సభ్యులకు రూ.3 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెదక్ ఎంపీ మాధవ నేనీ రఘునందన్ రావు సహకారంతో ఆర్థిక సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమానికి చిక్కుడు శ్రీశైలం, రాజు, నితిన్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగించాలంటు ఫిర్యాదు

నవతెలంగాణ-బెజ్జంకి

మండల కేంద్రంలోని పలు విద్యుత్ స్థంబాలకు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను తొలగించాలంటూ పంచాయతీ కార్యదర్శికి పిర్యాదు చేసినట్టు బీఆర్ఎస్ నాయకుడు పెద్దోళ్ల శ్రీనివాస్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పనుల్లో అభివృద్ధిని చూపించాలని ఫ్లెక్సీల్లో కాదని పంచాయతీ కార్యదర్శిని కోరినట్టు పెద్దోళ్ల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.



గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాటు చేయాలి

- పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ ఎం.మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేటకలెక్టరేట్

జిల్లా సన్నికృత కలెక్టర్ కార్యాలయంఅ లో ఈ నెల 17, 18 తేదీల్లో చేపట్టే గ్రూప్-3 పరీక్షలకు పకడ్బం దీగా ఏర్పాట్లు చేయాలని, పరీక్షల నిర్వహణ విజయవంతం చేయాలని టీజీపీఎస్సీ చైర్మెన్ ఎం. మహేందర్ రెడ్డి తెలిపా రు. బుధవారం కమిషన్ సభ్యుల తో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్-3 పరీక్షల నిర్వహ ణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, ఆర్సీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లు పటిష్టంగా చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఏర్పాట్లను ఒక రోజు ముందస్తుగా పూర్తి చేయాల న్నారు. త్రాగునీటి వసతి, కేంద్రం శానిటేషన్ చేయాలన్నారు. చీఫ్ సూపరిం టెండెంట్ కు తప్ప మరెవ్వరికి పరీక్షా కేంద్రం లోపలికి మొబైల్ ఫోన్ అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రంలోకి మొబైల్ ఫోన్, పుస్తకాలు, గాడ్జెస్,ఎలక్ట్రానిక్ పరికరాలు, అనుమతి లేని సామాగ్రిని, క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టి, కేంద్రంలోకి రాకుండా చూడాలన్నారు. సెంటర్‌ల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎక్కడ సమస్యలు రాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అబ్జర్వర్, రూట్ అధికారి, ఫ్లయింగ్ స్క్వాడ్, శాఖాధికారి, చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు అన్ని స్థాయిల వారికి పరీక్ష నిర్వహణ విషయమై తగు శిక్షణ ఇచ్చి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు సజావుగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి, జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, అడిషనల్ డీసీపీలు మల్లారెడ్డి, సుభాష్ చంద్రబోస్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లపై పేదల ఆశలు

- ప్రజా పాలనలో దరఖాస్తులు 2,36 లక్షలు
- జిల్లాకు 13 వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు



నవతెలంగాణ-గజ్వేల్

ఇందిరమ్మ ఇళ్లపై పేదలు ఎంతో మంది ఎదురుచూస్తున్నారు. అధికారులకు వచ్చిన కాంగ్రెస్ పేదలకు ఎలాంటి ఇండ్లు ఇచ్చి భరోసా చేస్తుందో తెలియడం లేదు. ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ముఖ్యంగా పనిచేసిన ఇందిరమ్మ ఇండ్ల పథకం. ఇల్లు లేని వారికి ఇల్లు కట్టిస్తామని స్థలం ఉన్నవారికి డబ్బులు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపనతో ముందుకు సాగుతుంది. దరఖాస్తులకు అనుగుణంగా ఇళ్లను కేటాయించకపోవడం పై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 2 లక్షల36 మంది దరఖాస్తు చేసుకోగా కేవలం 13 వేల ఇండ్లు మాత్రమే కేటాయించారు. జిల్లా అధికారుల పరిశీలన ఎలా ఉంటుందో అని పేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నారు. అధికారుల పరిశీలించిన కోసం ఇందిరమ్మ ఇండ్ల కమిటీలను వెయ్యాలని సూచించినప్పటికీ ఇప్పటివరకు కమిటీలను ఖరారు చేయలేకపోయింది. సిద్దిపేట జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 2,36,014 దరఖాస్తులను స్వీకరించారు. ఒక్కొక్క అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లను మంజూరుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. మండలాల వారీగా చూస్తే ఈ ఇండ్లు 13,377 ఈ మూలకు సరిపోవు. అధికారులు గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ వార్డుల ప్రకారం సర్వే నిర్వహిస్తారు. ఇందిరమ్మ కమిటీలో వాటిని చర్చించి నిర్ణయం తీసుకుంటారు. రాజకీయ అంశాన్ని తెరపై కాకుండా క్షేత్రస్థాయిలో రాజకీయ కోణంలోనే ఇంద్రమ్మ ఇల్లు మంజూరు అయ్యే అవకాశం ఉంది. ప్రత్యేకంగా అధికారులను నియమిస్తారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రత్యేక యాప్ను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. పది నెలలుగా ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇండ్ల కోసం పేదలకు ఎంతవరకు న్యాయం జరుగుతుందో వేచి చూడాలి.

ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

మాదకద్రవ్యాలకు అలవాటు పడి బానిసలు అయి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి అన్నాడు. బుధవారం మై భారత్ నెహ్రు యువ కేంద్ర, జిల్లా సమగ్ర శిక్షాలు సమన్వయంతో సిద్దిపేట పట్టణం లోని విపంచి కళా నిలయంలో విద్యా శాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి భాస్కర్ అధ్యక్షతన మాదక ద్రవ్యాల పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఏరియా హాస్పిటల్ సూపరిడెంట్ శాంతితో కలసి మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస అయి తల్లిదండ్రుల ఆశలకు గండి కోట్టోద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అడిషనల్ సూపరిడెంట్ శ్రీనివాస మూర్తి, టూ టౌన్ సీఐ ఉపేందర్, ఎక్సైజ్ ఎస్ కిరణ్, నెహ్రు యువ కేంద్ర జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్, మురళి, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను జ్యుడీషియల్ కస్టడీకి తరలింపు

- దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్



నవతెలంగాణ-రాయపోల్

దొంగతనం కేసులో నిందితులుగా ఉండి కొద్ది రోజులుగా తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం తిరుమలపూర్ గ్రామంలో ఎనిమిది నెలల క్రితం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తుండగా పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నారు. విచారణ చేపట్టి సాంకేతిక పరిజ్ఞానంతో వారిని బుధవారం అరెస్టు చేసి గజ్వేల్ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి బి.ప్రియాంక ముందు హాజరుపరచగా కేసు విచారణ చేపట్టి నిందితులు సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వాసర గ్రామం బీభ్యానాయక్, చందర్ నాయక్ తాండకు చెందిన రాథోడ్ (జాదవ్ నగేష్)కు 3 ఏండ్ల కఠిన కారాగార శిక్ష , జాదవ్ పుమ్దాలిక్‌కు 4 నెలల జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధించడం జరిగిం దని దౌల్తాబాద్ ఎస్సై శ్రీరామ్ ప్రేమ్ దీప్ తెలిపారు

మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

- 12వ వార్డు కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని 12వ వార్డు కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత నాలుగున్నర ఏండ్లుగా వార్డులో సాధ్యమైన వారికి సాయం చేస్తూ తగిన నిధులతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు. వార్డులో మౌలిక సదుపాయాలు కల్పనకు తన వంతు కృషి చేసినట్లు తెలిపారు. గత కేసీఆర్ పాలనలో నిధులు మంజూరుతో అభివృద్ధి పనులు ముందుకు తీసుకుపో యినట్లు అన్నారు. ప్రభుత్వం మారడంతో కొంత అభివృద్ధి మిగిలిపోయిందని చెప్పారు. మున్సిపల్ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి మిగతా చోట్ల సీసీ రోడ్లు, మురికి కాలువ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. కేసీఆర్, హరీశ్‌రావు నాయకత్వంలో మున్సిపల్ అభివృద్ధి చెందిందని, పెండింగ్ పనులు కొంతవరకు ఉన్నాయని అవి పూర్తి కావాలంటే నిధులు మంజూరు చేయాలన్నారు. అంతేగాకుండా ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. 6 గ్యారంటీలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఇప్పటి వరకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగతా వాటిపై దృష్టి పెట్టలేదు అన్నారు. 12 వార్డులో మరికొంతమందికి గ్యాస్, విద్యుత్ సౌకర్యాలు అందడం లేదని అన్నారు. ఉచిత 200 యూనిట్ల విద్యుత్తు సైతం కొంతమందికే అందుతుందని అన్నారు. మహిళలకు ఇస్తామన్నా రూ.2500 అందించాలని కోరారు. తులం బంగారం, కళ్యాణ లక్ష్మి, షాద్ ముబారక్ పథకాలను కొనసాగించి పేదలకు న్యాయం చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలోని 12 వార్డులో ఇంటింటికి తాగునీరు అందుతుందని, సీసీ రోడ్లు కొంతవరకు చేయించినట్లు చెప్పారు. అంతేకాకుండా కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకాల్లో ఇంద్రమ్మ ఇండ్లను 12వ వార్డుకు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో కోహెడ కానిస్టేబుల్ నవీన్ మృతి

- సంతాపం వ్యక్తం చేసిన సీపీ. డాక్టర్ బి అనురాధ



నవతెలంగాణ-సిద్దిపేటఅర్బన్

కోహెడ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ పెంబర్తి నవీన్ (38) మంగళవారం రాత్రి చిన్నకోడూర్ పోలీస్ స్టేషన్ పరిధి ఇబ్రహీం నగర్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదం లో మృతి చెందారు. రోజులాగే మంగళవారం కూడా విధులు ముగించుకొని తిరిగి సిద్దిపేటకు వస్తుండగా మార్గమధ్యంలో, ఆయన నడుపుతున్న కారు అదుపుతప్పి డివైడర్ మధ్యలో నుంచి పక్కకు వెళ్లి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సుకు డీకోట్టగా, తీవ్ర గాయాలతో ప్రమాద స్థలంలోనే మరణించారు. చిన్నకోడూర్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న సీపీ. డాక్టర్ బి. అనురాధ తీవ్ర దిగ్భ్రాంతి, సంతాపంను వ్యక్తం చేసారు. యువ కానిస్టేబుల్ ను కోల్పోవడం బాధాకరం అన్నారు. డిపార్ట్మెంట్ తరఫున రావలసిన అన్ని బెనిఫిట్స్ త్వరలోనే కుటుంబ సభ్యులకు అందజేస్తామని తెలిపారు. కాగా విషయం తెలుసు కున్న అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి నవీన్ మృతదేహంపై పుష్పగుచ్చాలు వేసి నివాళు లర్పించారు. ఆయనతో పాటు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, టూ టౌన్ సీఐ ఉపేందర్, ఎస్ఐ లు అభిలాష్, బాలకృష్ణ, విజయ్ భాస్కర్‌లు నవీన్ స్వస్థలం రాజక్క పేట మండలం దుబ్బాక గ్రామానికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్చాలు వేసి నివాళు లర్పించారు.

సామాజిక కుల గణన సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్



నవతెలంగాణ-రాయపోల్

సమగ్ర కుటుంబ సర్వేలో అందరూ తమ కుటుంబ వివరాలను నమోదు చేసుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నాడు. బుధవారం మండల కేంద్రంలో సమగ్ర సర్వే పై అవగాహన కల్పించి దళిత వాడలో జరిగిన సర్వేలో కుటుంబాల వివరాల నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో తమ సామాజిక, ఆర్థిక, రాజకీయ, భూమి, ఉపాధి, విద్య రిజర్వేషన్‌ల వల్ల లబ్దిపొందున వివరాలు నమోదు చేయించుకోవాలన్నారు. 56వ చివరి ప్రశ్నలో దళిత కుటుంబాలు ఎదుర్కొంటున్న కుల వివక్ష, దేవాలయాల ప్రవేశాల నిరాకరణ నమోదు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కుటుంబ సర్వే రాజకీయ కోణంలో కాకుండా సామాజిక న్యాయం కోణంలో చూసి ప్రతి ఒక్కరూ వారి యొక్క పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు, రాయపోల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు పుట్ట రాజు, జర్నలిస్ట్ కనుక స్వామి, నవీన్, ముకుందం, విష్ణు, పుట్ట నవీన్, రఘురామ్, లింగం, శంకర్, భాను ప్రసాద్, కృష్ణ, స్వామి, నర్సవ్వ లక్ష్మి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన

- రాయపోల్ ఎస్సై విక్కుర్తి రఘుపతి

నవతెలంగాణ-రాయపోల్

విద్యార్థులకు మహిళల రక్షణ చట్టలు, సైబర్ నేరాలు, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించడం జరిగిందని రాయపోల్ ఎస్ఐ రఘుపతి అన్నారు. బుధవారం మండలం రామారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, చట్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నూతన చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నూతన చట్టాల్లో నేరం చేసిన నేరస్తులకు కఠినమైన శిక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. బాధితులకు అండగా చట్టాలు నిలుస్తాయని పేర్కొన్నారు. మహిళలు, పిల్లలు ఎవరితోనైనా హింసకు ఎవరైనా హేళనంగా మాట్లాడిన మౌనం వీడి తల్లిదండ్రులకు కానీ స్నేహితులకు కానీ చెప్పుకోవాలని సూచించారు. లేనిపక్షంలో డయల్-100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. పిల్లలు, మహిళలు ఏమైనా సమస్యలు ఇంట్లో కానీ బయట కానీ ఎదుర్కొంటే వెంటనే షిటీమ్ వాట్సప్ నెంబర్ 8712667343, మహిళ పోలీస్ స్టేషన్ నెంబర్ 8712667435, సమాచారం అందించాలని, సమాచార అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు రాజగోపాల్ రెడ్డి, గజ్వేల్ షీటీమ్ ఏఎస్ఐ శ్రీరాములు, మహిళ కానిస్టేబుల్ శ్యామల, కానిస్టేబుల్ రామచంద్రారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కులగణను అడ్డుకోవడం దురదృష్టకరం



నవతెలంగాణ-గజ్వేల్

బీజేపీ, బీఆర్ఎస్ చీకటి ఒప్పం దం ప్రకారమే రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డిని తిట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వ అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాలను అడ్డుగిస్తూ ప్రజల్లో వ్యతిరేకతను సృష్టిస్తున్నారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఊడేం సారిక శ్రీనివాస్ రెడ్డిలు అన్నారు. బుధవారం గజ్వేల్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలు అమలు చేస్తూ ప్రజల్లో సానుభూతిని సంపాదించుకుంటుంటే ఓర్వలేక బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. 75 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో కుల గణన జరుగుతుంటే ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని కుల గణన జరిగితే సమాజంలో సామాజిక సమన్యాయం జరిగి ఎన్నో అంశాలు తెలుస్తాయని, తద్వారా సామాజిక వర్గానికి చెందిన 42 శాతం మందికి న్యాయం జరుగుతుందన్నారు. 75 ప్రశ్నలతో కుటుంబానికి సంబంధించిన ప్రతి విషయాన్ని ప్రభుత్వం సేకరిస్తుందని వీటి ద్వారా అన్ని సామాజిక వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



నవతెలంగాణ-రాయపోల్

స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా పదో తరగతి విద్యార్థులు ఒక్క రోజు ఉపాధ్యా యులుగా పాత్ర వహించి మిగతా విద్యార్థులకు పాఠాలు బోధించడం జరిగిందని బాలికల జిల్లా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు నెల్లూరు శేషయ్య అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలో ఆ పాఠశాలలో స్వయం స్వపరి పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు డీఈఓ ఎస్. అనూష, ప్రధానోపా ధ్యాయురాలు సిహెచ్.అక్షిత, మిగతా విద్యార్థులు సబ్జెక్టుల వారీగా వారి వారి పాత్ర నిర్వహించారు. దీనివల్ల నిజ జీవితంలో కూడా సమాజంలో ఏ విధంగా ఉండాలనే విషయంలో స్వీయ అనుభవం ద్వారా విద్యార్థులకు స్వయంగా తెలుస్తుందని తెలిపారు. పదో తరగతి చదివే విద్యార్థులకు వారి పై చదువులకు తొలిమెట్టుగా భావించి కష్టపడి చదివి పాఠశాలకు, వారి తల్లిదండ్రులకు పేరు తీసుకొచ్చే విధంగా అందరు ఉత్తీర్ణులు కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వెంకటమ్మ, ఫ్రాన్సిస్ చౌరీ, జీ. కృష్ణవేణి, ఎస్. జయలక్ష్మి, కే. మంజుల, ఆర్. భూపతి రెడ్డి, సిహెచ్. స్రవంతి, సిహెచ్. మహేశ్వరి, పి.రాజేశం, వి.మోహన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE II ADDL. DIST JUDGE AT SANGAREDDY
I.A.NO. 32 OF 2022
IN
O.S.NO. 108 OF 2008

Between:
Chappati Shivamma & another ...Petitioners / Plaintiffs.
AND
Chappati Venkatalah & others. ...Respondents / Defendants

To
Dooda Padma W/o. Yadagiri (D/o. Late Yadamma), Aged about 48 years, Occ: House wife, R/o. H.No.5-18, Gavvalapally (V), Shankarampet (M), Medak Dist., (Respondent / LR of D-2)

NOTICE

Whereas the Plaintiff filed the the above petition U/sec.5 of Limitation Act, against you and others. The case is posted on 28-11-2024 for your appearance before the said court on the said date at 10.30 a.m. if you fails to appear on the said date and time before the said court the case will be decided as per law.

// BY ORDER OF THE COURT //
K. KRISHNA RAO,
CH. RAJ KUMAR,
Advocates,
Sangareddy.